జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

లక్నోపై పంజాబ్ విజయం..
ప్లే ఆఫ్స్‌కు చేరువగా కింగ్స్
8లో..



సంపుటి: 11 సంచిక: 285 సోమవారం 05-05-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com




## మాయం కానున్న మూసీ మురుగు

- రూ.3100 కోట్లతో ట్రంక్ లైన్లు
- రెండు దశల్లో నిర్మాణానికి ప్రణాళికలు
- నిధుల సమీకరణకు అధికారుల యత్నాలు
- సీఎం రేవంత్ ఆదేశాలతో చకచకా పనులు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 03):**
మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ప్రాజెక్టును చేపట్టింది. రూ. 3,100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్లు నిర్మించనున్నారు. 80 శాతం మురుగు మూసీలోకి చేరుతుండటంతో.. 39 అదనపు ఎస్టీపీలను నిర్మించనున్నారు. నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరం, దక్షిణం వైపు ట్రంక్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.
హైదరాబాద్ నగరవాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది మిగతా 2వ పేజీలో..

## దేశ ప్రజలు కోరుకుందే జరుగుతుంది!



- ఎవరికైనా ధీటుగా సమాధానం చెబుతాం
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ సంచలన ప్రకటన
- పాక్‌కు పరోక్ష సంకేతాలు

**జర్నలిస్ట్ డైరీ, న్యూఢిల్లీ(మే 04):**
కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రజలు కోరుకునేది కచ్చితంగా జరిగి తీరుతుందన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ప్రజలు ఆకాంక్షించేదే జరుగుతుందని తెలిపారు. ఉగ్రదాడిపై కఠినంగా స్పందిస్తామని త్వరలోనే తగిన ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవంలో ఆయన ప్రసంగించారు. 'ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ దృఢ సంకల్పం గురించి బాగా తెలుసు. ఆయన తీసుకునే నిర్ణయాలు కఠినంగా ఉంటాయి. మోడీ నాయకత్వంలో దేశ ప్రజలు ఏది కోరుకుంటే అది తప్పకుండా జరుగుతుంది. ఈ విషయంలో నేను హామీ ఇస్తున్నా' అని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడిపై ప్రభుత్వం అవసరమైన, సముచితమైన ప్రతీకార చర్య తీసుకుంటుందని తెలిపారు. దేశ సరిహద్దులను రక్షించాలని, దేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసే వారికి తగిన సమాధానం చెప్పాలన్నారు. రక్షణ మంత్రిగా సైనికులతో పాటు దేశాన్ని సురక్షితంగా ఉంచడమే తన బాధ్యత అని చెప్పారు. దేశంపై దాడి చేయడానికి ధైర్యం చేసే ఎవరికైనా దీటుగా సమాధానం ఇస్తామన్నారు. వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారని హెచ్చరించారు. భారత్ బలం కేవలం సాయుధ బలగాల్లోనే గాక దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉందన్నారు. జవాన్లు దేశ భౌతిక సరిహద్దులను రక్షిస్తుండగా, సాధువులు ఋషులు దేశ ఆధ్యాత్మికతను కాపాడుతారన్నారు. ప్రపంచంలోని ఏ శక్తి భారతదేశాన్ని నాశనం చేయలేదని దీమా వ్యక్తం చేశారు.


## అమెరికా పర్యటనకు కవిత


2

## కూటమిని వెంటాడుతున్న ప్రమాదాలు


2

## తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కన్నుమూత


2



## రాజకీయాల్లో కొత్త గీత

### రేవంత్ ధీమాకు కారణం అదేనా? పదేండ్ల పాలన పాలమూరు బిడ్డకు సాధ్యమా?

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. రాబోయే 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసురుతూ, కాంగ్రెస్ దీర్ఘకాల పాలనకు బలమైన సంకేతంగా కనిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ఈ ధీమాకు మూలమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. కేసీఆర్ రాజకీయంగా ఒంటరిగా మారి, ఫార్మ్ హౌస్‌కే పరిమితమవుతారని, ఆయన రాజకీయ ప్రస్థానం ముగిసిపోతుందని ఘాటుగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్తిని రేకెత్తించగా, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఇటీవలి ఎన్నికల్లో ఎదురైన ఓటములు, పార్టీలో అంతర్గత సమస్యలు రేవంత్ వ్యాఖ్యలకు బలం చేకూర్చాయని విశ్లేషకులు చెబుతున్నారు.ఉప శీర్షిక 3: తెలంగాణ రాజకీయాల్లో కొత్త గీత రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయా? కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తోంది. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు పథకం, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలతో ప్రజల్లో విశ్వాసం పెంచే ప్రయత్నం మిగతా 2వ పేజీలో..

## ఎరక్కపోయి వచ్చామే..!



- మింగలేక.. కక్కలేక అన్నట్లుగా పరిస్థితి
- ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో టెన్షన్ టెన్షన్
- వారి భవితవ్యంపై సర్వత్రా ఆసక్తికర చర్చ

2


2

## ఆపేదే లేదు!


2

## అసమర్థతా.. అసంతృప్తా..?

## పిల్లలమర్రికి.. అందాల భామలు

- సీఎం రేవంత్ చొరవతో షెడ్యూల్‌లో చోటు
- మే 16న సందర్శనకు ఏర్పాట్లు

2



# అసమర్థతా.. అసంతృప్తా..?

- **బదిలీలపై బదిలీలు**
- **వరుస ట్రాన్స్‌ఫర్లతో గజిబిజీ**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (మే 04):**

పరిపాలన విభాగంలో ఐఏఎస్ లు అత్యంత కీలకపాత్ర పోషిస్తారు. విధానాల రూపకల్పన, వాటిని అమలుచేయడంలో ఐఏఎస్‌లు ఎంతో ముఖ్యం. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పరిపాలనలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కీలకమార్పులకు సీఎం రేవంత్ రెడ్డి సర్కారు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల 20 ఐఏఎస్ అధికారులను ఒకేసారి బదిలీచేయడం ఇందులో భాగమేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర కావొ స్తున్న సందర్భంగా పరిపాలన విభాగంలో ప్రక్షాళనకు పూనుకున్నట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు త్వరలో నే మరో 30మంది ఐఏఎస్ అధికారులను కూడా బదిలీ చేస్తారని సమాచారం. ఇందులో భాగంగా రాష్ట్రంలోని సగం జిల్లాల కలెక్టర్లకు స్థానచలనం కల్పించే అవకాశం ఉన్నట్టు అధికారవర్గాల నుంచి వస్తున్న సమాచారం. సమర్థత ఆధారంగానే ఐఏఎస్ పోస్టుంగులను ఇవ్వనున్నట్టు ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు స్పెషల్ సీఎస్ స్థాయి నుంచి జూనియర్ ఐఏఎస్ వరకు బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అడపాదడపా ఐఏఎస్‌ల బదిలీలు చేసినప్పటికీ ఇంత భారీస్థాయిలో బదిలీ చేయడం గమనార్హం. ఇటీవల 20మంది ఐఏఎస్‌లను బదిలీ చేయడంతోపాటు మరో 30 మంది ఐఏఎస్‌లను కూడా అదే క్రమంలో బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నది. వాస్తవానికి గత ప్రభుత్వంలో పనిచేసిన చాలా మంది అధికారులు ఆ స్థానంలోనే కొనసాగతున్నారు. ఈ నేపథ్యంలో ఆయాశాఖల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులను మార్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నది.ఈక్రమంలోనే పరిపాలన విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైంది. అయితే అధికారుల బదిలీ అంటే చాలా అనుమానాలు రేకెత్తుతాయి. ఆయా శాఖల్లో పనితీరులో అసమర్థత, అవినీతి, అక్రమాల ఆరోపణలు వంటి అనేక అంశాలు చర్చకు వస్తాయి. ఈ నేపథ్యంలో కొందరు అధికారులకు ప్రమోషన్ లభిస్తే, మరికొందరికీ ప్రాధాన్యం లేని శాఖల కేటాయింపు వంటి డిమోషన్ ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అయినప్పటికీ పరిపాలనలో ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సహకరించడం లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతాధికారుల పనితీరుపై పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి సైతం అసంతృప్తి వ్యక్తం చేయడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. దీంతోపాటు ప్రభుత్వంలో కొనసాగుతూ రహస్యాలు బయటకు పంపుతున్నారని పలువురు ఐఏఎస్‌లపై అనుమానాలు ఉన్నట్టు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఐఏఎస్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ కొందరు మాత్రం గత పాలకులకు సహకరిస్తున్నా రని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఐఏఎస్‌లను బదిలీ చేసి పరిపాలన వ్యవస్థను గాడిన పెట్టాలని సీఎం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే త్వరలోనే మరోసారి భారీగా ఐఏఎస్‌ల బదిలీ ఉం టుందని సమాచారం.దీని కోసం విషయ పరిజ్ఞానం, కొత్త కొత్త ఆలోచనలతో ప్రజల దగ్గరకు వెళ్లే సమర్థత ఉన్న అధికారులను గుర్తించి మంచి స్థానం కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఏసీ రూములు వదిలి గ్రామాల్లో పర్యటించి ప్రజల అవసరాలు, ప్రభుత్వ పథకాలను వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు వేదికలపై నుంచి అధికారులకు సూచించారు. అందులో భాగంగా విడతల వారీగా ఐఏఎస్‌లతోపాటు ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లను కూడా బదిలీ చేసేందుకు కసరత్తు చేస్తోంది.



# కూటమిని వెంటాడుతున్న ప్రమాదాలు

- **ఏపీ సర్కార్‌కు తప్పని ఇక్కట్లు**
- **విమర్శల వెల్లువలో ప్రభుత్వం**

**జర్నలిస్ట్ డైరీ, విశాఖపట్టణం (మే 04):**

ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయింది. పాలనాపరంగా ఇప్పుడిప్పుడే ప్రభుత్వం కుదుటపడుతోంది. మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. అదే సమయంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధపడింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో ఏపీలో విపత్తులు, వివాదాలు, ప్రమాదాలు ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పది నెలల్లోనే ఏపీ ప్రభుత్వం చాలా రకాల విపత్తులను ఎదుర్కొంది. ప్రభుత్వానికి అవి సవాల్ గా మారాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం తట్టుకొని ముందుకు సాగుతోంది. సహజంగానే విపత్తులను, ప్రమాదాలను ప్రతిపక్షం రాజకీయాలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం జరుగుతున్నది అదే.గత ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సెప్టెంబర్లో విజయవాడను బుడమేరు ముంచేసింది. దీంతో వేలాది కుటుంబాలు వరదల్లో చిక్కుకున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారు. కనీసం ఆహారం కూడా వారికి దొరకని పరిస్థితి. అటువంటి సమయంలో సీఎం చంద్రబాబు నేనున్నాను అంటూ బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. రోజుల తరబడి విజయవాడలోనే మకాం వేసి బాధితులకు స్వయంగా వరద నీటిలోనే వెళ్లి పరామర్శించారు. వారికి అన్ని విధాల సాయం చేశారు. రాత్రికి రాత్రి వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు వర్కౌట్ అయ్యాయి. అయితే ఈ కష్టం నుంచి బయటపడే క్రమంలో.. ఏలూరులోని ఎర్ర కాలువ పొంగింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఇబ్బందులు తప్పలేదు.అటు తర్వాత ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఉద్యోగులతో పాటు కార్మికులు చనిపోయారు. అటు తర్వాత కాకినాడలోని పరిశ్రమలో సైతం ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల పరామర్శ, వారికి పరిహారం అందించడంలో ప్రభుత్వం ముందంజలో నిలిచింది. క్యాబినెట్ మంత్రులు సైతం నేరుగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వపరంగా అండగా నిలిచారు.ఈ ఏడాది జనవరిలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల పంపిణీలో అపశృతి జరిగింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోయారు. ఇది పెను వివాదానికి దారితీసింది. మృతుల కుటుంబాలకు టీటీడీతో పాటు ప్రభుత్వం అండగా నిలిచింది. పరిహారం కూడా అందించింది. అంతకుముందు టీటీడీ లడ్డు ప్రసాదం వివాదం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. మరోవైపు తూర్పుగోదావరి జిల్లాలో బాణాసంచా పేలుడు కారణంగా 8 మంది చనిపోయారు. తాజాగా సింహాచలంలో జరిగిన ఘటనలో భక్తులు మరణించారు. ఇప్పుడు వారికి ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. ప్రభుత్వం పాలనలో మునిగి తేలుతున్న తరుణంలో ఇలా ప్రమాదాలు, వివాదాలు, విపత్తులు.. తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నాయి. మరి వీటన్నింటినీ తట్టుకొని కూటమి ప్రభుత్వం ఎలా నిలబడుతుందో చూడాలి.

# తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి


- **తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి**
- **జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కన్నుమూత**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04):**

తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లో ఉదయం 10.15 గంటలకు జస్టిస్ ప్రియదర్శిని మరణించారు. న్యాయమూర్తి ప్రియదర్శిని హఠాన్మరణం పట్ల న్యాయవాద వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె మృతికి పలువురు న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. జస్టిస్ ఎం.జి. ప్రియదర్శిని అంత్యక్రియలు నేడు నగరంలో జరగనున్నాయి. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. జస్టిస్ ప్రియదర్శిని తన విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండేవారని, కేసులను లోతుగా పరిశీలించి న్యాయమైన తీర్పులు వెలువరించేవారని పలువురు న్యాయవాదులు గుర్తు చేసుకున్నారు. ఆమె మరణం తెలంగాణ న్యాయవ్యవస్థకు తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ మాటురి గిరిజా ప్రియదర్శిని తన విధి నిర్వహణలో నిబద్ధత, న్యాయ సూత్రాల పట్ల గౌరవంతో వ్యవహరించేవారని న్యాయవాద వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి.

# ఎరక్కపోయి వచ్చామే..!

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04):**



గులాబీ గూటినుంచి కాంగ్రెస్ లోకి వలస వచ్చిన 10 మంది పరిస్థితి ఇప్పుడు ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారిందట. వలసొచ్చిన కాంగ్రెస్ పార్టీలో మనస్ఫూర్తిగా ఉండలేకపోతున్నారు. అలాగని తిరిగి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్న చర్చ తెలంగాణ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.మరోవైపు సుప్రీం కోర్టు ఏ క్షణంలో ఎలాంటి తీర్పునిస్తుందో అన్న టెన్షన్ 10 మందిని వెంటాడుతోందట. భవిష్యత్తు బావుంటుందన్న ఆశతో అధికార హస్తంపార్టీలో చేరితే..మొదటికే మోసం వస్తుందా అన్నమానాలు వారిని వెంటాడుతున్నాయట. బీఆర్ఎస్ పార్టీలో కారుగుర్తుపై గెలిచి..ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలంతా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారట.కాంగ్రెస్ లో చేరిన వెంటనే తాము కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉంటూ ఇక అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకోవచ్చని అంతా భావించారు. కానీ ఇక్కడే వ్యవహారం బెడిసికొట్టింది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఆ పది మంది ఎమ్మెల్యేలను అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దగా గుర్తించడంలేదట.ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, పార్టీలోని ముఖ్య నేతలు, మంత్రులెవరూ తమను పెద్దగా పట్టించుకోవడంలేదని.. పార్టీలోకి వస్తే ఇది చేస్తాం...అది చేస్తామంటూ ఇచ్చిన హామీలపై కనీసం మాటకూడా మాట్లాడడంలేదని 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ, ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారట. దీంతో తాము పార్టీ మారి తప్పు చేశామా అనే సందిగ్ధంలో పడ్డారట ఆ 10మంది ఎమ్మెల్యేలు. అయితే కొంత మంది ఎమ్మెల్యేలు తిరిగి గులాబీ గూటికి వెళ్తే ఎలా ఉంటుందని ఆలోచన కూడా చేసినట్లు తెలుస్తోంది.

గూడెం మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, దానం నాగేందర్ వంటి వలస ఎమ్మెల్యేలు మళ్ళీ బీఆర్ఎస్ లోకి వెళ్లేందుకు ప్రయత్నం కూడా చేశారన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పించినా..ఆ పది మంది ఎమ్మెల్యేలను ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని గులాబీ బాస్ కేసీఆర్ స్ట్రాంగ్ నిర్ణయం తీసుకున్నారట.పార్టీలోకి వచ్చేందుకు ట్రై చేసిన ఆ ఎమ్మెల్యేలకు నో ఛాన్స్ అని వారి మొహం మీదే చెప్పేశారట పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. దీంతో ఏం చేయాలో పాలుపోక..బిక్కమోహంతో కాంగ్రెస్ పార్టీలో కొట్టుమిట్టాడుతున్నారట పార్టీ మారిన ఆ 10మంది ఎమ్మెల్యేలు. తమ రాజకీయ భవిష్యత్ ఏంటంటూ దిగాలుగా ఉన్నారని పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇదిలా ఉంటే మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కేటీఆర్, పాడికౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేయడంతో..ఏ క్షణంలో కోర్టు ఎటువంటి తీర్పునిస్తుందో అని తెగ టెన్షన్ పడుతున్నారట వారంతా.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారని స్పీకర్ పై ఇప్పటికే తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. స్పీకర్ తో పాటు ఆ పదిమంది ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు ఇచ్చి విచారణ కూడా జరిపింది. దీంతో కోర్టు తీర్పుపై ఆ 10మంది ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే తమపై ఖచ్చితంగా వేటు పడడం ఖాయమంటూ కొంతమంది ఎమ్మెల్యేలు అనుమానం వ్యక్తం చేస్తున్నారట. ఒకవైపు కాంగ్రెస్ లో ఉండలేక, మరోవైపు తిరిగి గులాబీ గూటికి వెళ్లలేక ఆ పది మంది ఎమ్మెల్యేలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి కారుగుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఆ 10 మంది ఎమ్మెల్యేల పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్లుగా ఉందట. వెళ్లే దారులన్నీ మూసుకుపోవడంతో...ఎలా ముందుకు వెళ్లాలో... ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారట.

సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే వీరి పరిస్థితిపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటూ తెలంగాణ రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. పార్టీమారిన ఎమ్మెల్యేలపై ఒకవేళ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు పడితే మాత్రం ఉప ఎన్నికలు రావడం ఖాయం.అయితే బై ఎలక్షన్లో గెలిస్తే సరి..ఒకవేళ ఓడిపోతే భవిష్యత్ ఏంటన్న ఆందోళన పార్టీ మారిన ఆ 10 ఎమ్మెల్యేలను వెంటాడుతోందట. ఎందుకంటే సుప్రీం తీర్పు నేపథ్యంలో బై ఎలక్షన్స్ వస్తే...ఆ 10 నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను దించాలని ఇప్పటికే గులాబీ బాస్ కేసీఆర్ ప్రయత్నాలను మొదలుపెట్టినట్లు టాక్ విన్పిస్తోంది. ఆ దిశగా ఇప్పటికే కాంగ్రెస్‌లో అసంతృప్తితో కొట్టుమిట్టలాడుతున్న నేతలకు గాలం వేస్తున్నట్లు సమాచారం. ఐతే ఇవన్నీ లెక్కలు తేలాలంటే సుప్రీంకోర్టు తీర్పునిచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే.

# మాయం కానున్న మూసీ మురుగు

**మొదటిపేజీ తరువాయి**

పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి.. లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది.



గతంలో జంట జలాశయాల నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది.ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్‌డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆపేదే లేదు!

- **ఆపరేషన్ కగార్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్**
- **అమాయకులను చంపిన వారితో చర్చలా?**
- **వారిని క్షమించే ప్రసక్తే లేదని ఘాటు వ్యాఖ్యలు**

**జర్నలిస్ట్ డైరీ, కరీంనగర్(మే 04):**

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా పలు పార్టీలు ఎన్డీయే ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు కొన్ని పార్టీల నేతలు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు లేఖలు సైతం రాశారు. ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక కామెంట్స్ చేశారు. ఆపరేషన్ కగార్ ఆపేదే లేదని, మావోయిస్టులతో మాటల్లేవ్.. మాట్లాడుకోవడాల్లేవ్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహావిష్కరణ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'తుపాకీ చేతపట్టి అమాయకులను చంపిన వారితో చర్చలకు తావులేదు. కాంగ్రెస్ ప్రభుత్వమే మావోయిస్టులను నిషేధించింది. గతంలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నేతలతో పాటు ఎందరో అమాయకులను మందుపాతరలతో చంపినది మావోయిస్టులే. గిరిజనులను ఇన్ఫార్మర్ల నెపంతో చంపిన వారిని క్షమించే ప్రసక్తే లేదు" అని అన్నారు. మావోయిస్టులు తుపాకులు వదిలేసే వరకు వారితో చర్చలు జరపబోమని ఆయన తేల్చి చెప్పారు.



కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని, కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. పాస్‌పోర్ట్ లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నామని, రోహింగ్యాలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతి భద్రతల సమస్యలను రాజకీయం చేయడం సరికాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, మావోయిస్టులతో చర్చల పేరుతో డ్రామాలు ఆడుతున్నాయని ఆయన దుయ్యబట్టారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడుతుందని బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## రాజకీయాల్లో
# కొత్త గీత

**మొదటిపేజీ తరువాయి**

చేస్తోంది. ఈ నేపథ్యంలో, రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యల ద్వారా ప్రతిపక్షాలను రెచ్చగొట్టి, తమ పార్టీ బలాన్ని చాటాలని చూస్తున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.తెలంగాణలో 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి, దశాబ్దాల తర్వాత అధికారంలోకి వచ్చింది. ఈ విజయం రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఊపిరిపోసింది.

**ప్రతిపక్షాల స్పందన:**
బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ఇంకా రాజకీయంగా బలంగా ఉన్నారని, రేవంత్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత దాడిగా ఉన్నాయని విమర్శించారు.సామాన్య ప్రజలు ఈ వ్యాఖ్యలను రాజకీయ డ్రామాగా భావిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ పాలనపై సానుకూల దృక్పథం ఉన్న వారు రేవంత్ ధీమాను సమర్థిస్తున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం రాజకీయ ఆరోపణలుగానే కాక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దీర్ఘకాల లక్ష్యాలను సూచిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపుతాయా లేక రాజకీయ శత్రుత్వాన్ని మరింత పెంచుతాయా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# అమెరికా పర్యటనకు కవిత

- **సీబీఐ కోర్టు గ్రీన్ సిగ్నల్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04):**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 16న అమెరికాకు వెళ్లనున్నారు. 16 నుంచి 23 వరకు అమెరికాలో ఆమె పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి కవిత దంపతులు అమెరికా వెళ్తున్నారు. ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. అయితే.. కవిత విదేశీ పర్యటనకు ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

# పిల్లలమర్రికి.. అందాల భామలు

**జర్నలిస్ట్ డైరీ, మహబూబ్ నగర్(మే 04)**

72వ మిస్ వరల్డ్ పోటీలు మే 7వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి దాదాపు 120 దేశాల నుండి 140 మందికి పైగా పోటీదారులు.. ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈసారి పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. విదేశీ అతిథులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పోటీల్లో పాల్గొనే అందాల భామలను రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. తొలుత 21 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని భావించినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మహబూబ్‌నగర్ జిల్లాలోని చారిత్రాత్మక పిల్లల మర్రిని కూడా ఈ జాబితాలో చేర్చారు. దీంతో సందర్శించే ప్రాంతాల సంఖ్య 22కు చేరుకుంది. మే 16న సందర్శించనున్నారు. అలాగే.. తొలుత హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించాలని అనుకున్నప్పటికీ.. దాని స్థానంలో చారిత్రాత్మక వేయి స్తంభాల గుడిని చేర్చారు. మిగిలిన 20 పర్యాటక ప్రాంతాల్లో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు.


విమానాశ్రయంలో దిగినప్పటి నుండి అతిథులకు తెలంగాణ ఆతిథ్యం.. సంస్కృతిని పరిచయం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో తెలుగు సంప్రదాయానికి అనుగుణంగా బొట్టు పెట్టి, మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలకడానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తోంది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ , పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి స్వయంగా విమానాశ్రయాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్ల కోసం



శంషాబాద్ పోలీసు అధికారులతో సమావేశమై సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అధికారులతో సమావేశమై.. అందాల పోటీల వేదికల వద్ద ఏర్పాట్లు.. విదేశీ అతిథుల బస, వసతి సౌకర్యాలు.. భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు ప్రభుత్వం త్వరలో ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయనుంది. ఈసారి మిస్ వరల్డ్ పోటీలు కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా.. తెలంగాణ గొప్ప సంస్కృతి, కళలు, పర్యాటక రంగాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ఒక గొప్ప వేదికగా మారనుంది.

# వైసీపీ ప్రక్షాళన దిశగా అడుగులు

- కీలక సంస్కరణలు చేపడుతున్న జగన్
- పార్టీని చక్కదిద్దాక మిగతా పనులు!



**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ (మే 04):**
వైసీపీని ప్రక్షాళన చేసే పనిలో ఆపార్టీ అధినేత జగన్ తలమునకలయ్యారట. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ నడుస్తోంది. సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట. ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్ విన్పిస్తోంది. ఇకనుంచి పార్టీలో వికేంద్రీకరణ విధానం తీసుకురావాలని చూస్తున్నారట.వైసీపీలో దిగువ స్థాయి నుంచే పార్టీ ఎదగాలని వారే బాధ్యులుగా మారి సమర్ధంగా పనిచేయాలని ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. అందుకే ఇటీవలి కాలంలో జరిగిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేసిన సూచనలు.. జిల్లా అధ్యక్షులు సమావేశంలో చేసిన దిశానిర్దేశం రెండింటిని పరిశీలిస్తే..పార్టీని నాయకులకే అప్పగిస్తున్నారన్న టాక్ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది. జగన్ అధ్యక్షతన జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో..పార్టీకి జిల్లా అధ్యక్షులే సర్వస్వం అన్నారట. మీరే పార్టీ..పార్టీనే మీరు అని క్లారిటీగా చెప్పేశారు. మీరే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని..ఎవరి కోసమో చూడొద్దని సూచించారు. మీకు ఎవరైనా ఆదేశిస్తారేమో అని ఎదురుచూడకుండా సొంత నిర్ణయాలు తీసుకోండి అని జగన్ ఫుల్ ఫ్రీడం ఇచ్చారట. జిల్లా పార్టీకి మీరే యజమానులు..మీ మాటే చెల్లుబాటు అవుతుంది. మీరే మొత్తం జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ తో కలుపుకుని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీ పరిధిలో రెండు వర్గాలు ఉంటే వారిని కో ఆర్డినేట్ చేసి సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారని సమాచారం. అంతేకాదు బాగా పనిచేయని ఇంచార్జిల విషయంలో కూడా ఒకటికి పదిసార్లు పరిశీలన చేసి..ఆ తర్వాత వారు దారికి రాకపోతే మార్చేసే విషయంలోనూ మీదే కీలకపాత్ర అన్నారు. జగన్ ఇంతలా వారి మీదనే ఎందుకు బాధ్యతలు మోపుతున్నారన్న చర్చ పార్టీ నేతల్లో మొదలైందట. పీఏసీ సభ్యులకూ ఇదే విధంగా సూచించారట.
అలాగే జిల్లా అధ్యక్షుల విషయంలో ఈ విధంగానే చెబుతున్నారు. దీంతో జగన్ అధికారాలను వికేంద్రీకరించి పార్టీని గ్రాస్ రూట్ లెవెల్ దాకా తీసుకెళ్ళాలని అనుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. పార్టీ అధినేత జగన్ అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తోంది. ఒకవైపు వైసీపీ ముఖ్య నేతలు వరుసగా అరెస్ట్ అవుతున్నారు. పైనున్న పెద్దలు దాకా కూడా ఈ అరెస్టులు రావచ్చు అన్న చర్చ సైతం పార్టీలో సాగుతోందట. అందుకే జగన్ అన్నీ చూసుకునే పార్టీని సమిష్టిగా నాయకులు అంతా కలసి నడిపే విధంగా ఈ కొత్త రకమైన రూపుని పార్టీకి అందిస్తున్నారని అంటున్నారు. ఏవైనా అనుకోని అవాంతరాలు ఏర్పడినా ఇబ్బందులు లేకుండా పార్టీ ముందుకు సాగాలని జగన్ ఆలోచిస్తున్నారని అంటున్నారు. పార్టీలో గత పరిస్థితులు ఇపుడు లేవని..అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారనే గుసగుసలు పార్టీవర్గాల్లో విన్పిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తట్టుకుని నిలబడేలా క్యాడర్ బేస్డ్ గా లీడర్ ఓరియేంటెడ్ గా పార్టీని తీర్చిదిద్దాలని జగన్ చూస్తున్నారని టాక్. మరి ఈ కొత్త రకమైన విధానం సక్సెస్ అయితే ఓకే గానీ, చిక్కుల్లా అందరికీ బాధ్యతలు ఇస్తే ఎవరు ఏంచేస్తారో అన్న సందేహం పార్టీ అధినేత జగన్ ను వెంటాడుతోందట. ఏది ఏమైనా వైసీపీ అధినాయకత్వం పార్టీని పటిష్టపరిచేందుకు సరికొత్త ఆలోచనలు చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది.

# దేశానికి మద్దతుగా రైతులు

- పాక్‌కు టమాట ఎగుమతులు నిలిపివేత
- కర్ణాటక రైతుల నిర్ణయం



**జర్నలిస్ట్ డైరీ, బెంగళూరు( మే 04):**
దాయాది దేశం పాకిస్తాన్ ఇప్పటికే ద్రవ్యోల్బణం, ఆర్ధిక సంక్షోభం, ఆహార సంక్షోభం వంటి వాటితో ఇబ్బంది పడుతూనే ఉంది. పాక్ వాసులకు తినడానికి తిండి కూడా లభించని స్టేజ్ లో ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడి నేపథ్యంలో పాకిస్తాన్ పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతుంది. అంతేకాదు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాకిస్తాన్ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు ఇప్పుడు కర్ణాటక రైతులు తమ వంతు అన్నట్లు పాక్ దేశానికి టమాటా ఎగుమతులు నిలిపివేశారు. మార్కెట్ మొత్తం ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద టమోటా మార్కెట్‌గా గుర్తింపు పొందింది. అదే కారణంతో కోలార్ జిల్లాలో పండించే నాణ్యమైన టమోటాలు దేశంలోని చాలా రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. జూన్, జూలై నెలలు టమోటా పంట కోతకు అనువైన నెలలు. ఈ సందర్భంగా ఇక్కడి రైతులు కోలార్ నుంచి పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, దుబాయ్ వంటి వివిధ దేశాలకు టమోటాలను ఎగుమతి చేస్తారు. అయితే ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఉగ్రవాద దాడి చేసి 27 మందిని చంపారు. దీని కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాకిస్తాన్‌పై దౌత్యపరంగా అనేక చర్యలు చేపట్టింది. ఇప్పుడు కోలార్‌లోని రైతులు తాము పండించిన టమోటాలను పాకిస్తాన్‌కు ఎగుమతి చేయడం నిలిపి వేశారు. ఇలాంటి చర్యలతో కోలార్ రైతులు పాకిస్తాన్‌ను కూడా దిగ్భ్రాంతికి గురిచేశారు.పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కోలార్ లోని రైతులు, వ్యాపారులు పాకిస్తాన్ పై మరో సర్జికల్ స్ట్రైక్ ప్రకటించారు. కోలార్ నుంచి పాకిస్తాన్‌కు టమోటాలు సరఫరా చేయడంపై పూర్తి నిషేధం ప్రకటించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్తాన్‌కు టమోటాలు సరఫరా చేయకూడదని రైతులు నిర్ణయించుకున్నారు. ప్రతి సంవత్సరం కోలార్ నుంచి 800 నుంచి 900 టన్నుల టమోటాలు పాకిస్తాన్‌కు సరఫరా అయ్యేవి. అయితే పహల్గామ్ దాడి నేపథ్యంలో వ్యాపారులు ఇకపై పాకిస్తాన్‌కు ఒక్క టమోటా కూడా పంపకూడదని నిర్ణయించుకున్నారు. ఇక్కడి వ్యాపారులకు పాకిస్తాన్ తో విడదీయరాని సంబంధం ఉంది. వాళ్ళు టమోటాలతో పాటు కూరగాయలను కూడా పంపేవారు. దీని ద్వారా ఇక్కడి రైతులు, వ్యాపారులు పాకిస్తాన్‌తో కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నారు. అయితే ఉగ్రవాదులు మతం అడిగి మరీ మరణ హోమం సృష్టించడంతో రైతులు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మారారు. తమకు నష్టాలు కలిగినా పాకిస్తాన్‌కు టమోటాలు ఎగుమతి చేయడమని రైతులు చెబుతున్నారు. 2013లో పుల్వామా దాడి సమయంలో పాకిస్తాన్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నప్పుడు.. కోలార్ రైతులు కూడా ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు పాకిస్తాన్ కు కోలార్ నుంచి టమోటాల ఎగుమతిని నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉన్నామని కోలార్ రైతులు కూడా చెబుతున్నారు.పాకిస్తాన్ ఉగ్రవాదులకు సపోర్ట్ చేయడం మానెయ్యాలని.. కేంద్ర ప్రభుత్వం నీరు.. ఇతర వస్తువులపై ఆంక్షలు విధించగా, కోలార్ రైతులు ఒక అడుగు ముందుకు వేసి టమోటాలు, కూరగాయల సరఫరాని నిలిపివేసి పాక్ ప్రజలకు షాక్ ఇచ్చారు. దీని వలన పాకిస్తాన్ ప్రజలు టమోటాలు, కూరగాయల కోసం ఇబ్బంది పడటం అనివార్యం.



## దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్

**జర్నలిస్ట్ డైరీ, మహబూబ్ నగర్ (మే04):**
దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు. కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సై మాధవ రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా మారుతి షిఫ్ట్ లో రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్రి యాదగిరి, గోవింద్ శివకుమార్, సంజపూర్ గ్రామానికి చెందిన బెల్లె శ్రీరాం అనుమానాస్పదంగా వ్యవహరించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో గత నెల 21న తుర్కలపల్లి గ్రామంలో ఓ ఇంటిలో రూ.5.20 లక్షలు, మార్గదర్శి కాలనీలో రూ.10 వేలు, జనగామ జిల్లాలో మోటార్ సైకిల్ దొంగిలించినట్టుగా నేరస్తులు ఒప్పుకున్నారని వారు వివరించారు. నిందితుల వద్ద నుంచి రూ.2.5 లక్షల నగదు, 3 సెల్ఫోన్లు, క్రైమ్ ఉపయోగించిన షిఫ్ట్ కారు, మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు.



## సైబర్ ఉచ్చులో చదువుకున్నవాళ్లే ఎక్కువ!

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్( మే 04):**
హైదరబాద్ మియాపూర్‌కు చెందిన 40 ఏళ్ల ఐటీ ఉద్యోగి, ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ యాడ్ ద్వారా ట్రేడింగ్ స్కామ్‌కు గురై ₹38.62 లక్షలు కోల్పోయాడు. వ్యాపారంలో ₹1.3 కోట్లు లాభాలుగా చూపించినా, అతని ఖాతాలో జమయిన మొత్తం కేవలం ₹200 మాత్రమే. ఈ కేసును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు మొదట ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్‌లో "ప్రియా శర్మ"గా తాను పరిచయం చేసుకున్న యువతి అతనికి ట్రేడింగ్ గురించీ, అధిక లాభాలు పొందే పద్ధతుల గురించీ వివరించింది. ఆమె అతనికి "ASK ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ" అనే యాప్ ఉపయోగించమని సూచించింది. దీనివల్ల బ్లాక్ ట్రేడ్స్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ వంటి విషయాల్లో మోహపూరితమైన వ్యూహాలతో అతన్ని పెట్టుబడి పెట్టించేందుకు ప్రోత్సహించిందివాట్సాప్ గ్రూప్‌లో వేరే సభ్యుల ద్వారా ఇచ్చిన టెస్ట్‌మోనియల్స్, స్క్రీన్‌షాట్‌లతో ఆకర్షితుడైన బాధితుడు తొలుత ₹50,000 పెట్టుబడి పెట్టి, తరువాత నెమ్మదిగా పెంచుతూ మొత్తం ₹14.87 లక్షలు పెట్టాడు. మొత్తంగా అతను తన ఖాతా మరియు భార్య ఖాతా ద్వారా ₹38.62 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు.ట్రేడింగ్ జరుగుతున్న సమయంలో ప్రియా అతనికి ₹1 కోటి లాభాలు వచ్చాయని చెప్పింది. కానీ, ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ముందు, ₹18 లక్షలు ట్యాక్స్ క్లియరెన్స్ పేరుతో డిమాండ్ చేసింది. బాధితుడు ఈ మొత్తం తన లాభాల నుంచి తీసుకోమని అడిగినప్పుడు, ఆమె దానికి అంగీకరించకుండా.. ట్యాక్స్‌ను వేరుగా చెల్లించాల్సిందేనని చెప్పింది.ఇంకొక సంఘటనలో, హైదరాబాద్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని ఇండియామార్ట్ అనే వాణిజ్య వెబ్‌సైట్‌లో ట్రాన్స్మిషన్ లైన్ టూల్స్ కోసం వెతుకుతున్న సమయంలో, మోసగాళ్లు ₹1,17,646కు మోసగించారు. US ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో పర్సనల్ జాయింట్ అకౌంట్‌కు చెందినట్లుగా తమను పరిచయం చేసుకున్నారు. బాధితుడికి ఫోన్లో మాట్లాడి పర్చేజ్ ఆర్డర్ పంపించారు.ఏప్రిల్ 5న ₹1,17,646 చెల్లింపును బాధితుడు చేశాడు. అయితే అప్పటి నుంచి అతనికి ఎటువంటి సరుకు రాలేదు. ఫాలో అప్‌లో, మోసగాళ్లు వాట్సాప్ ద్వారా మరిన్ని నకిలీ రసీదులు, షిప్పింగ్ డాక్యుమెంట్లు పంపించారు.సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి మాట్లాడుతూ, "బాధితుల ఫిర్యాదుల ఆధారంగా మోసగాళ్లను గుర్తించే పనిలో ఉన్నాం" అన్నారు. ఇలాంటి నేరు జరిగినప్పుడు వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు

# ది లీడర్ : జలగం వెంగళరావు

- తెలుగు రాజకీయాలపై తనదైన ముద్ర





ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో జలగం వెంగళరావు ఒక ప్రముఖ వ్యక్తి. దృఢమైన పరిపాలన ఆయన సొంతం. అభివృద్ధి కార్యక్రమాలు ఆయన మార్క్. కొన్ని వివాదాస్పద నిర్ణయాలతో ఆయన పేరు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఎమర్జెన్సీ చీకటి రోజులను ఆయన విజయాలకు సోపానాలుగా సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. 1921లో మే నెలలో శ్రీకాకుళం జిల్లా 'రాజాం'లో జన్మించిన వెంగళరావు, బయ్యన్నగూడెం వెలమ సామాజిక వర్గానికి చెందినవారు. యుక్త వయసులోనే నిజాం శాసనానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొని, తెలంగాణ ప్రాంతంలో అన్యాయపు భూమి విధానాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. ఈ అనుభవం ఆయన రాజకీయ జీవితానికి బలమైన పునాది వేసింది. ప్రముఖ కవి దాశరథి ఆయనకు సన్నిహిత మిత్రుడు. ఒకే జైల్లో ఖైదీలుగా గడిపారు. వెంగళరావు రాజకీయ ప్రస్థానం 1952లో స్వతంత్ర అభ్యర్థిగా శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడంతో మొదలైంది. అయినప్పటికీ, ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి, 1952 నుంచి 1962 వరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించారు. 1962లో సత్తుపల్లి నియోజకవర్గం నుంచి శాసన సభ సభ్యుడిగా గెలిచారు. 196971 మధ్య కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో హోం మంత్రిగా, 197273లో పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో పరిశ్రమల మంత్రిగా పనిచేశారు. 1973లో జై ఆంధ్ర ఉద్యమం నేపథ్యంలో రాష్ట్రపతి పాలన ఎత్తివేయబడిన తర్వాత, ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎంపికయ్యారు. 1973 డిసెంబర్ 10 నుంచి 1978 మార్చి 6 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. వెంగళరావు హయాంలో ఖమ్మం జిల్లా అభివృద్ధి గణనీయమైన పురోగతిని సాధించింది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ పూర్తిచేయడం ద్వారా ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యం మెరుగైంది. వ్యవసాయ ఉత్పాదకత బాగా పెరిగింది. ఈ ప్రాజెక్ట్ రైతుల జీవనోపాధికి ఊతమిచ్చింది.

### తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవానికి పెద్దపీట

రాష్ట్ర వ్యాప్తంగా, వెంగళరావు పరిపాలన తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూడా దోహదపడింది. 1975లో హైదరాబాద్‌లో నిర్వహించిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు రాష్ట్రంలో ఐక్యత, సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేశాయి. ఈ సభలు, ప్రత్యేక తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల తర్వాత రాష్ట్రంలో ఐక్యతను పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించాయి. 1975ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా ప్రకటించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.విద్యా రంగ అభివృద్ధికి వెంగళరావు విశేషంగా కృషి చేశారు. తెలంగాణలో కాకతీయ విశ్వవిద్యాలయం, కోస్తా ఆంధ్రలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, రాయలసీమలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్థాపించి రాష్ట్రంలో ఉన్నత విద్యకు బలమైన పునాది వేశారు. ఈ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు స్థానికంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చాయి. ఎన్జీఓలకు ఉన్నత స్కేళ్ళను ఇచ్చారు.అనేక ఎన్జీవో భవనాలను ఉద్యోగులకు కేటాయించిన తొలి ముఖ్యమంత్రి ఆయన. అయితే, వెంగళరావు పరిపాలన నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడంలో తీసుకున్న కఠిన చర్యలకు ఎక్కువగా గుర్తుండిపోయింది. నక్సలైట్ కార్యకలాపాలను నియంత్రించడానికి ఆయన ఉక్కుపాదం మోపారు. అనేక ఎన్ కౌంటర్ లు జరిగాయి. ఇది దేశవ్యాప్తంగా ఆయనకు గుర్తింపు తెచ్చినప్పటికీ, అనేక విమర్శలకూ దారితీసింది.వెంగళరావు పరిపాలనపై వచ్చిన విమర్శలు ప్రధానంగా రెండు అంశాల చుట్టూ తిరిగాయి. మొదటిది, నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడంలో ఆయన తీసుకున్న కఠిన చర్యలు. పౌర హక్కుల సంఘాలు, వామపక్ష నాయకులు ఈ చర్యలను గట్టిగా విమర్శించారు.వారిని జేళ్ళపాలు చేశారు. అనేక ఎన్‌కౌంటర్‌లు, అరెస్టులు మానవ హక్కుల ఉల్లంఘనలకు దారితీశాయని లెక్కలేనన్ని ఆరోపణలు వచ్చాయి. రెండవది, ఆయన పరిపాలనలో కొన్ని విభాగాల మధ్య అసమానతలు కొనసాగాయని, ప్రత్యేకించి తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి అంత సమతుల్యంగా జరగలేదని విమర్శలు వచ్చాయి. ఖమ్మంలో తొలి ఆమరణ దీక్షకు కూర్చున్న రవీంద్రనాథ్ ను బలవంతంగా అర్ధరాత్రి అరెస్టు చేయించి బలమైన తెలంగాణ ఉద్యమాన్ని అణచి వేయడానికి హోం మంత్రిగా తన పదవిని ఉపయోగించుకున్నారు. ఈ విమర్శలు ఆయన హయాంలో రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచాయి.

### ధైర్యంగా, స్పష్టంగా నిర్ణయాలు

వెంగళరావు వ్యక్తిత్వం ఒక వైపు దృఢసంకల్పం, మరోవైపు సాంస్కృతిక సున్నితత్వం కలిగిన సమ్మిశ్ర రూపంగా కనిపిస్తుంది. ఆయన నిర్ణయాలు తీసుకునే విషయంలో ధైర్యంగా, స్పష్టంగా ఉండేవారు. నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొన్న తీరు, అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసిన విధానం ఆయన నాయకత్వ లక్షణాలకు నిదర్శనం. అదే సమయంలో, తెలుగు సాంస్కృతిక సంవత్సరం, తొలి "ప్రపంచ తెలుగు మహాసభల" వంటి కార్యక్రమాల ద్వారా ఆయన సాంస్కృతిక వారసత్వం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. అయితే, విమర్శలను ఎదుర్కొనే విషయంలో ఆయన కొంత రాజీ పడని స్వభావం కొన్నిసార్లు వివాదాలకు దారితీసింది.మొత్తంగా, జలగం వెంగళరావు ఒక బలమైన నాయకుడు, అభివృద్ధి కార్యకర్త, సాంస్కృతిక పోషకుడు. ఆయన హయాంలో ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందడుగు వేశాయి. అయితే, నక్సలైట్ అణచివేత, ప్రాంతీయ అసమానతలపై వచ్చిన విమర్శలు ఆయన వారసత్వంపై మచ్చగా మిగిలాయి. ఆయన వ్యక్తిత్వం దృఢత, సాంస్కృతిక గౌరవం, రాజకీయ ధైర్యం కలబోసిన అరుదైన సమ్మేళనం. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఆయన స్థానం ఒక సంక్లిష్టమైన, అయినా ప్రభావవంతమైన నాయకుడిగా ఎప్పటికీ గుర్తుండి పోతుంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



## 75 ఏళ్లలోనూ... ఏం స్టామినా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకే నాలుగు సార్లు ముఖ్యమంత్రి కాగలిగారు. ఆయన నిత్యం జనంలో ఉండేందుకు ఇష్టపడతారు. ఎన్నడూ పార్టీ కార్యాలయంలోనో, తన ఆఫీసులోనో కూర్చుని ఉండటం ఆయనకు చేతకాదు. 1995లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ అదే జరుగుతుంది. వయసు పెరిగే కొద్దీ కొంత అలసట తో పాటు అలసత్వం కూడా వస్తుంది. కానీ చంద్రబాబు లో ఈ రెండు కానరవావు. ఒకరకంగా అదే చంద్రబాబు నాయుడు సక్సెస్ సీక్రెట్ అని చెప్పాలి. ప్రజల్లో ఉండాలని పరితపించడమంటే మామూలు విషయం కాదు. తాను చేయలేని విషయాలను చేయలేనని చెప్పే గట్స్ కూడా లీడర్ అనే వారికి ఉండాలి. అది చంద్రబాబులో పుష్కలంగా ఉన్నాయి. 1995లో అంటే అప్పుడు కొద్దిగా ఓపిగ్గా ఉండబట్టి ప్రతి రోజూ జిల్లాలు తిరిగే వారు. రోజుకు పద్దెనిమిది గంటలు పనిసే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు. 24 X 7 అందుబాటు లో ఉండేందుకే ప్రయత్నిస్తారు. ఇటీవల తన పుట్టిన రోజు వేడుకలను జరపుకునేందుకు యూరప్ పర్యటనకు వెళ్లి ఐదు రోజులు గడిపి ఢిల్లీకి వచ్చారు. అర్ధరాత్రి ఢిల్లీకి చేరినా ఉదయం నుంచి కేంద్ర మంత్రులతో వరసగా సమావేశమై రాష్ట్రాభివృద్ధికి సంబంధించి, అనేక ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఒంగోలులో హత్యకు గురయిన వీరయ్య చౌదరి అంతిమ సంస్కారంలో పాల్గొనేందుకు ప్రకాశం జిల్లాలోని నాగులుప్పలపాడు బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి మళ్లీ విశాఖకు వెళ్లి కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులర్పించారు. నిజానికి ఈ పనులు ఆయన చేయకపోయినా పార్టీ నేతలను లేదా లోకేశ్ ను పంపే వీలుంది. కానీ చంద్రబాబు మాత్రం స్వయంగా వెళ్లి ఈ రెండు ఘటనలకు హాజరై వచ్చిన విషయం అందరినీ అబ్బుర పర్చింది. ఈ స్టామినా నేటి యువతరం నేతలకు ఎందుకు లేదు? అన్న కామెంట్స్ బలంగా వినిపించాయి. ఆయన ఓపికకు హేట్సాఫ్ చెప్పితీరాల్సిందేనని అంటున్నారు. మొన్నటి వరకూ అంటే గత ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ కూడా ఇలా పర్యటనలు చేయలేదు. తక్కువలో తక్కువగా ఏదైనా బహిరంగ సభకు మాత్రమే హాజరయ్యేవారు. కానీ చంద్రబాబు నాయుడు పార్టీ కార్యకర్తల హత్య జరిగినా, మరో ఘటన జరిగినా తానే స్వయంగా వెళ్లి పాల్గొనడంతో ఆయన పట్ల మరింత క్రేజ్ పెరగడానికి కారణమయింది. ఫస్ట్ తారీఖు వచ్చిందంటే చాలు... ఇక మొదటి తేదీ వచ్చిందంటే చాటు... చంద్రబాబు కాళ్లు ఒక పట్టాన నిలవవు. నిజానికి తాను స్వయంగా వెళ్లి పింఛన్లు అందచేయాల్సిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే పింఛను మొత్తాన్ని తాను వచ్చిన తర్వాతనే ఒక్కసారిగా నాలుగు వేల రూపాయలకు పెంచారు. దీనికి పెద్దగా ప్రచారం చేసుకోవాల్సిన అవసరమూ లేదు. అయినా సరే ప్రతి నెల మొదటి తారీఖు వచ్చిందంటే చాలు.. వెంటనే ఏదో ఒక జిల్లాలో వాలిపోతారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు ఇంటికి వెళ్లి పింఛను ఇస్తారు. అంతటితో ఆగకుండా వారి ఇంట్లోనే టీ తయారు చేసి అందరికీ ఇస్తారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడు ప్రచారం కోసమే చేస్తున్నారని విమర్శలున్నప్పటికీ ఆ ఓపిక దేశంలో ఏ రాష్ట్రంలోని ముఖ్యమంత్రికి లేదని స్పష్టంగా చెప్పొచ్చు.

# కేంద్రం తీసుకున్న చారిత్రక నిర్ణయం



గత కొన్ని సంవత్సరాలుగా "కుల గణన" ను సిద్ధాంతం రిత్యా వ్యతిరేకిస్తూ వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, చివరకు ప్రజా డిమాండ్ కు తలొగ్గి తన వైఖరిని మార్చుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో, రాబోయే జనాభా గణనతో పాటు "కుల గణన" కూడా నిర్వహించాలని నిర్ణయించడం దేశ చరిత్రలో ఒక కీలక మలుపు. అయితే, ఐదేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ "జనాభా గణన" ఎప్పుడు మొదలవుతుందనే విషయంలో స్పష్టత లేదు. స్వాతంత్ర్యం తర్వాత, అణగారిన జాతులకు విద్యా అవకాశాలు, ఉన్నత స్థాయి ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఆ జాతుల్లో అవగాహన పెరిగింది. అయితే, జనాభాకు తగిన నిష్పత్తిలో అవకాశాలు లభించడం లేదనే అసంతృప్తి పెరిగుతూ వస్తుంది. ఈ నేపథ్యంలో కుల గణన డిమాండ్ బలంగా వినిపించింది. ఆంధ్రప్రదేశ్ ఈ డిమాండ్‌ను మొదట స్వాగతించిన రాష్ట్రం. 2021లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, కేంద్రాన్ని కుల గణన నిర్వహించాలని కోరుతూ శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించింది. 2024 జనవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగవంతమైన, శాస్త్రీయ కుల గణన జరిగింది. బీహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కూడా గతంలోనే కుల గణనలు నిర్వహించాయి.

అయితే, బీజేపీ మొదటి నుంచి ఈ డిమాండ్‌ను వ్యతిరేకించింది. 2021 జులై 20న, లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, అప్పటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, 'ఎస్సీ, ఎస్టీలు తప్ప ఇతర కులాలను గణనలోకి తీసుకోకూడదని కేంద్రం నిర్ణయించింది' అని ప్రకటించారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నాయకులు బహిరంగంగా కుల గణనను వ్యతిరేకించారు, బీజేపేతర రాష్ట్రాల్లో కూడా "పట్టణ ప్రాంతాల అగ్ర కులాల వారు" బహిరంగంగా సోషల్ మీడియాలో "కుల గణనను" విమర్శించారు. బీజేపీలో బీసీ నాయకుల సంఖ్య తక్కువ కనుక పార్టీ నిర్ణయం మేరకు మౌనంగా ఉన్నారు. మోదీ,అమిత్ షా మాత్రం "కాంగ్రెస్ కులం పేరుతో సమాజాన్ని విభజిస్తోందని" పార్లమెంటులోనూ,బయటా పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. ఇటీవల, ఛత్తీస్‌గఢ్ బీజేపీ ఒక ట్వీట్‌లో, "వారు అడిగింది మతం గురించి... కులం గురించి కాదు" అని పేర్కొంది. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ కు ప్రజల్లో విస్తృతంగా మద్దతు లభిస్తుంది.రాహుల్ గాంధీకి బీసీలు ఎక్కడికి వెళ్ళినా నీరాజనం పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధిక జనాభా కలిగిన బీసీలను దూరం పెడితే ఏలా అన్ని చర్చ బీజేపీ బీసీ వర్గాలలో లోలోపల జరుగుతూ వస్తోంది. అయితే, రెండు నెలల క్రితం ఒక ఆంగ్ల పత్రిక, ఆరెస్సెస్ కుల గణనను సరైనదిగా భావిస్తోందని వెల్లడించడంతో, కేంద్రం కూడా సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే అంచనాలు పెరిగాయి. జనాభా గణనతో పాటు కుల గణన కూడా జరిగితే, దాదాపు ఒక శతాబ్దం తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ అమలులోకి వస్తుంది. చివరిసారిగా 1931లో బ్రిటిష్ పాలనలో కుల గణన జరిగింది. అప్పుడు 4,147 కులాలు ఉన్నట్లు తేలింది. 1901లో ఈ సంఖ్య 1,646గా ఉంది. 1941లో కొంతవరకు కులాల గణన జరిగినా, రెండో ప్రపంచ యుద్ధం కారణంగా అది ఆగిపోయింది. స్వాతంత్ర్యం తర్వాత, ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే సేకరించబడ్డాయి. 1992లో పీపుల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ నిర్వహించిన సర్వే ప్రకారం, దేశంలో 4,635 కులాలు ఉన్నాయి. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కుల గణన జరిపేందుకు హామీ ఇచ్చారు. 201112లో సామాజికఆర్థిక సర్వే కింద గణన జరిగినా, ఆ డేటాను విడుదల చేయలేదు.

ఇటీవల కాంగ్రెస్ జాతి గణనపై పట్టుదలతో ఉంది. మతంపై దృష్టి సారించే బీజేపీ దీనికి అంగీకరించదని భావించారు. కానీ, బీజేపీ ఆకస్మికంగా తన వైఖరి మార్చడంతో, కాంగ్రెస్ ఎన్నికల్లో ఈ అంశాన్ని ప్రధాన ఆయుధంగా ఉపయోగించే అవకాశాన్ని కోల్పోయింది.ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ మన భారత దేశంలో దాపురించింది.ఏది ఏమైనా మన దేశంలో "కులం" ఒక సామాజిక వాస్తవం. దాని ప్రభావం సమాజంపై ప్రగాఢంగా ఉంది. అయినప్పటికీ, ప్రభుత్వాలు దీనిని సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేశాయి. దీనివల్ల రెండు రకాల సమస్యలు తలెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల ప్రయోజనాలు లక్షిత వర్గాలకు సరిగ్గా అందడం లేదు. ఇంకా చాలా కులాలు,ఉప కులాల వారికి ప్రభుత్వ పథకాల గురించి కనీస అవగాహన కూడా లేదు. ఫలితంగా, ఇంతకాలం మన ప్రభుత్వాలు బడ్జెట్‌లో గర్వంగా ప్రకటించిన పథకాలు ఆచరణలో వినియోగం కాకుండా మిగిలిపోతున్నాయి. ఈ బీసీలు జనాభాలో మూడో వంతు ఉన్నా వారి సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు అరకొరగా నిధులను కేటాయించి చేతులు దులుపుకున్నారు. గత పదేళ్లుగా బీజేపీ కూడా బీసీల పట్ల తీవ్ర వివక్షతను చూపించిది. బీజేపీ హిందూ మతం పేరిట ఓట్లు రాజకీయాలు చేసిందే కానీ, బీసీల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. పైగా ప్రధాన మంత్రి మోదీ బీసీ అంటు ప్రచారానికే పరిమితం అయింది. అన్ని కులాల్లో ఉప కులాలు సంఖ్య కచ్చితంగా కుల గణినం ద్వారా తేలితే ఇంకా నైనా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సంస్కృతీ పరంగా వెనుకబడిన కులాలు వారికి కుల దామాషా ప్రకారం ప్రభుత్వాలు కొంతైనా న్యాయం చేయగలుగుతాయి. కుల గణనన శాస్త్రీయంగా జరిపిస్తే, ప్రజల దృష్టి తమ ఉపకుల సంక్షేమం పై ఉంటుంది. బీజేపీ గతంలోలా ఓట్లు కోసం ఉపయోగించిన "మత చాణక్యం" ఇంకా ముందు కొన సాగటం కష్టమే.

ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్ 50 శాతాన్ని మించకూడదని తీర్పు ఇవ్వడం, కొత్తగా ఉద్భవిస్తున్న కులాలకు న్యాయం చేయడానికి అడ్డంకిగా మారింది.ఈ సమస్య ఉందని ప్రభుత్వాలకు తెలిసినా, దాన్ని పరిష్కరించడం సాధ్యపడటం లేదు. అన్ని రంగాల్లో అగ్ర కులాల ఆధిపత్యమే కొనసాగుతోంది. సకాలంలో నిర్ణయాలు తీసుకోవడంలో, రాజకీయ గాలులకు (పొలిటికల్ వేవ్స్ కు )అనుగుణంగా మారడంలో బీజేపీని మించిన రాజకీయ పార్టీ లేదు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందే, మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికల సమయంలో కేంద్రం కుల గణన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని అందరూ ఊహించారు. అలా జరిగి ఉంటే, కాంగ్రెస్ ఈ డిమాండ్‌కు తలొగ్గి ఉండేది. పహల్గామ్‌లో జరిగిన హత్యాకాండపై దేశం ఆగ్రహంతో ఉన్న సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం, కాంగ్రెస్‌కు ఈ ఘనతను క్లెయిమ్ చేసే అవకాశాన్ని ఇవ్వలేదు. బీహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ నిర్ణయం బీజేపీకి రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. అయితే, ఈ గణనతో పాటు వచ్చే ఇతర డిమాండ్‌లను పార్టీ ఎలా ఎదుర్కొంటుందనేది చూడాలి. కుల గణన అనేది చారిత్రక నిర్ణయం. దీన్ని చిత్తశుద్ధితో ఆచరణలో అమలు చేస్తే ఇది సామాజిక న్యాయానికి దారితీసే అవకాశం ఉంటుంది. అయితే, దీని అమలు, డేటా ఆధారంగా తీసుకునే చర్యలు, రాజకీయ పరిణామాలు ఈ నిర్ణయం యొక్క విజయాన్ని నిర్ణయిస్తాయి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## భగ్గుమంటున్న బెంగాల్



పశ్చిమ బెంగాల్లో ఒకదాని వెంట ఒకటిగా చోటుచేసుకుంటున్న వివాదాలు అక్కడ శాంతి భద్రతలకు సవాలుగా మారాయి. నిరుడు పార్లమెంటు ఎన్నికలకు ముందు సందేశ్ ఖలీ మానభంగాల కేసు, గత ఏడాది కోల్ కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసు వివాదాలకు ఎలా కారణమయ్యాయో చూశాం. ఇప్పుడు ఈ మధ్య 26 వేలమంది స్కూలు టీచర్ల నియామకాలను సుప్రీంకోర్టు తప్పుపట్టడంతో మరో వివాదం... ఇవన్నీ దీదీ సర్కార్ ను షేక్ చేస్తుండగా... తాజాగా వక్స్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లు షూ రువు. వారం రోజుల క్రితం వక్స్ సవరణ చట్టం అమలులోకి రాగా, దేశంలో ఎక్కడా లేనంత తీవ్ర స్థాయిలో బెంగాల్ లో అల్లర్లు జరిగాయి. ముస్లిం జనాభా ఎక్కు వగా ఉన్న ముర్షీదాబాద్, మాల్డా, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాలు నిరసనలతో అట్టుడుకుతున్నాయి. ఈ అల్లర్లకు ఇప్పటికే ముగ్గురు బలి కాగా, ప్రభుత్వ, ప్రయవేటు ఆస్తులు భారీస్థాయిలో ధ్వంసమయ్యాయి. నిర సనకారులు ప్రధాన రహదారుల్ని, రైల్వే ట్రాకుల్నీ దిగ్బంధం చేస్తూ ప్రజా జీవనానికి ఇబ్బంది పెడుతుంద్రు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్స్ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా అల్లర్లు తగ్గుముఖం పట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


అల్లర్లు జర పక్కన పెడితే రాష్ట్రంలో బీజేపీ, టీఎంసీ రాజకీయ ప్రయోజనాలకోసం పాకులాడుతూ, పరస్పర విమర్శలను దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. బెంగాల్ లో ఎప్పుడు అల్లర్లు చెలరేగినా దాన్ని ప్రభుత్వతప్పిదంగా మాట్లాడే బిజెపి.. ఇటీవల 26 వేల మంది టీచర్ల నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే అంటోంది. అల్లర్లకు కేంద్ర బిందువైన ముర్షీదాబాద్ జిల్లాలో ముస్లిం జనాభాదే ఆధిపత్యం. ఈ జిల్లాలోని 3 పార్లమెంటు సీట్లను టీఎంసీ గెలుచుకుంది. 22 అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లకు తృణమూల్ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాంటప్పుడు, అల్లర్లు ఎలా చెలరేగాయన్న ప్రశ్నకు అధికార పార్టీనుంచి జవాబు లేకపోవడం గమనార్హం. గతంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడూ ముర్షీదాబాద్ భగ్గుమంది. ఇంతటి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంలో ముందుజాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రభుత్వమే జవాబు చెప్పాలి. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం అల్లర్ల విషయంలో బాధ్యత విస్మరించి.. స్వ ప్రయోజనాలకోసం పాకులాడుతూండటంతో పౌరులే ముందుకొచ్చి బెంగాల్ పరిస్థితిపై జోక్యం చేసుకోవాలని కోర్టులను ఆశ్రయిస్తున్నారు. హైకోర్టు జోక్యం చేసుకుని రాష్ట్రానికి కేంద్ర భద్రతా బలగాలను పంపించాలంటూ ఆదేశించడం గమనార్హం. వక్స్ చట్టంలో లొసుగులున్నాయని భావిస్తే, వాటిని కోర్టులో సవాల్ చేసే హక్కు ఉంది. అంతేగానీ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అల్లర్లకు దిగడం పద్ధతి కాదు.
సమాజంలో ఒక వర్గాన్ని బుజ్జగించేందుకు వక్స్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి చెప్పడం ప్రజాస్వామిక వ్యవస్థనే హాస్యం చేసే విధంగా ఉంది. పార్లమెంటు చేసిన చట్టాలను అమలు చేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. అలాంటప్పుడు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మమత పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని అమలు చేయబోమని ఎలా చెబుతారు? ప్రతిపక్షాల ఆరోపణలను వమ్ము చేసేందుకు దీదీ సర్కార్ అల్లర్లను అణచివేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవలసినవసరం ఉంది. ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న బెంగాల్ లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మంచిది కాదు.

**పట్ట హరి ప్రసాద్**
**8790843009**

## భారీ అగ్ని ప్రమాదం

**జర్నలిస్ట్ డైరీ,**
**సికింద్రాబాద్ (మే 04) :**

నగరంలోని సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ ఎస్‌బీఐ అడ్మిషన్ బిల్డింగ్ లో భారీ అగ్ని ప్రమాదం కలకలం రేపింది. అడ్మిస్టేషన్ ఐదవ అంతస్తులో భారీగా మంటలు ఎగిసి పడ్డాయి. మంటల ధాటికి ఐదవ ఫ్లోర్ పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి మూడు ఫైర్ ఇంజన్స్ చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాయి. షాట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. విలువైన ఫైల్స్ దగ్ధమైనట్లు సమాచారం. బిల్డింగ్ లో ఎవరైనా ఉన్నారా లేదా అనేది తేలాల్సి ఉందని, ఆదివారం సెలవు కావడంతో ప్రమాదం తప్పిందని అధికారులు తెలుపుతున్నారు.




# ఎఫ్ఎస్‌సీలో కుటుంబాల వివరాలు తారుమారు..!

- ఆరుగురిని నలుగురు, ఏడుగురిని తొమ్మిదిగా మార్చిన రెవెన్యూ అధికారులు...
- నూతన రేషన్ కార్డు మంజూరులో ఆలోచింపజేస్తున్న అధికారుల పనితీరు..?

**జర్నలిస్ట్ డైరీ, పాలేరు (మే 04)**






తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాకుండానే, ప్రక్రియ ప్రారంభ దశలోనే ప్రజల నుంచి తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి. దానికి గల కారణాలు రేషన్ లోని కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు రాక పోవడం, పేర్లు తొలగించడం, కొత్త వారి పేర్లు చేర్చడంలో అధికారుల పనితీరు అంతంత మాత్రమే అని చెప్తున్నారు మండల ప్రజానీకం. తిరుమలాయపాలెం మండలం పరిధిలోని బచ్చోడు తండా గ్రామపంచాయతీలో బానోత్ లలిత, భర్త సంజీవ వారి ఆహార భద్రత కార్డులో కుటుంబంలో మొత్తం పిల్లలతో సహా ఏడుగురు సభ్యులు ఉండాలి. కానీ వారి ఆహార భద్రత కార్డులో, మాజీ సర్పంచి బానోత్ సునీత, భర్త పేరు బిక్షం వారికి ఒక పాప ముగ్గురు కుమారులు, వారిలో ఇద్దరు పేర్లు భానోత్ భాను ప్రకాష్, బానోత్ భాను వర్ధన్, వీరు కుటుంబంలోని మొత్తం ఆరుగురు ఉండాలి. వీరి ఇద్దరి కుమారులను వీరి కార్డులో జత చేయకుండా, బానోత్ లలిత కార్డులో జత చేయడంతో వారి కార్డులోని సంఖ్య తొమ్మిదికి చేరుకుంది. ఆరుగురుగా ఉండాల్సిన వీరి సంఖ్య నలుగురికీ పరిమితమైంది. లలిత కూతురు (గుగులోత్ మమత) పేరు కూడా, తన ఇంటి పేరుతో ఉండకుండా, తన భర్త ఇంటి పేరుతో ఉండటం కూడా వీరి నిర్లక్ష్య పని తీరుకు నిదర్శనం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. కనీసం ఆహార భద్రత కార్డులో పేర్లను జత చేయాలంటే వాళ్ళ జనన ధ్రువీకరణ పత్రం తప్పకుండా జతపరచవలసి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టించుకోకుండా అధికారులు ఇష్టానుసారంగా ఒక కుటుంబ సభ్యులను వేరే కుటుంబంలో చేర్చారంటే వాళ్ళ పనితీరును ఆలోచింపజేయాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఇలాంటి అధికారులు పనితీరుతో ప్రజలు ఇసుక చెందుతున్నారు. ఇప్పుడు ఈ సంఘటన మండల వ్యాప్తంగా సంచలనం రేకిస్తుంది. ఇవి పొరపాటున జరిగిన తప్పిదమా.? లేకపోతే కావాలని చేసిన తప్పిదమా అని ఆ కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. అసలే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలన, గ్రామ సభలు, సర్వేల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన రేషన్ కార్డులు మంజూరు చేయమని చెప్తుంటే, మండల అధికారులు మాత్రం ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలను తిప్పలు పెడుతున్నారు. ఈ పనీ తీరును బట్టి చూస్తే తెలుస్తుంది ప్రజా ప్రభుత్వంలో అధికారుల పనీ తీరు ఎలా ఉందనేదీ, ఇకనైనా మండల రెవెన్యూ అధికారులు తమ పనీ తీరును మార్చుకోవాలనీ స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# అబ్దుల్లాపూర్ మెట్ సీఐగా అశోక్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**




అబ్దుల్లాపూర్ మెట్ సీఐగా అశోక్ రెడ్డి బాధ్యతల స్వీకరణ అబ్దుల్లాపూర్ మెట్ పోలీసుస్టేషన్ నూతన ఇన్ స్పెక్టర్ గా వై.అశోక్ రెడ్డి నియమితులయ్యారు. సైబర్ క్రైమ్ పీఎస్ నుంచి అబ్దుల్లాపూర్ మెట్ పీఎస్ కు రాచకొండ కమిషనర్ ఉత్తర్వుల మేరకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్ స్పెక్టర్ గా పని చేసిన బి.అంజిరెడ్డి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.

# కారులో ఒక్కసారిగా మంటలు

**జర్నలిస్ట్ డైరీ, ఉప్పల్ (మే 04) :**

ఆగి ఉన్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన ఉప్పల్లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఉప్పల్ రింగు రోడ్డు వరంగల్ బస్ స్టాప్ వద్ద టీఎస్ 09 ఎఫ్‌వీ 2666 నెంబర్ గల కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెంటనే చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే కారు ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య కారుగా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం

- పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**



క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో తోడ్పడుతుందని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు.చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ ఎన్ఐఎస్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దానాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు వేడుకలలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ ఎన్ఐఎస్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దానాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను మే 1 వ తేదీ నుండి మే 4వ తేదీ వరకు నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని, ముగింపు వేడుకలలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగిందని, విజేతలకు, పాల్గొన్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ క్రీడల్లో పాల్గొనడం చాలా అభినందనీయమని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధరణమని, ఓటమి గెలుపుకు నాంది అన్నది మర్చిపోవద్దని, గెలిచేందుకు ప్రయత్నించాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడాకారులలో దాగిన సృజనాత్మకత ను బయటకు వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో తొడ్పడుతుందని, పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నరేందర్ బల్లా, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ


**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**

అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం విస్తరణ, పునర్నిర్మాణం భూమి పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రకాష్ గౌడ్ కాలనీ అద్యక్షుడు చింతకింది పవన్ గౌడ్, బాలింగ్ రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, కృష్ణ ముదిరాజ్ ,ఎం శ్రీనివాస్ గౌడ్, పరమేష్, బెనర్జీ, వెంకట్ చారి, రాజారాం, సంగారెడ్డి, అంజనేయులు, కే శ్రీనివాసులు, ఏవి రావు, జి శ్రీనివాస్ గౌడ్, సింహాచలం, భాస్కర్, బాపు రెడ్డి, సత్యనారాయణ, బాలరాజ్, నరేష్, మహేందర్, రవి, మల్లేష్, వీరాస్వామి, లక్ష్మీకాంత్, జాలయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యూహాత్మకంగా జనసేనాని

- ప్రభుత్వ నిర్ణయాలపై
- టచ్ మీ నాట్‌గా పవన్
- భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొనేనా?

**జర్నలిస్ట్ డైరీ, గుంటూరు(మే 04):**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజకీయాలను బాగానే అలవర్చుకున్నారు. టచ్ మి నాట్ గా ఉండటానికి అనేక కారణాలున్నాయంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి కనుచూపు మేరలో బాగుపడే అవకాశం కనిపించడం లేదు. అప్పులు చేయాలి. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేయాలన్నా, నాలుగేళ్ల పాటు కొనసాగించాలన్నా చాలా కష్టమే. ఇప్పుడు సహకరించినట్లు కేంద్ర ప్రభుత్వం భవిష్యత్ లో సహకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే దాని పరిమితులు దానికి ఉంటాయి. ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ మరింత టైట్ చేసే అవకాశం కేంద్రంలో కనిపిస్తుంది. తనపరిమితమవుతూ.. అందుకే పవన్ కల్యాణ్ ప్రతి విషయంలో పూసుకుని తిరగకుండా తన శాఖకే పరిమితమవ్వాలని నిర్ణయించుకున్నారు. కూటమి ప్రభుత్వమని అంటున్నా అది పూర్తిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడానికే వదిలేశారు. అంటే మంచి జరిగినా, చెడు జరిగినా అది చంద్రబాబు నాయుడు ఖాతాలోకే వెళుతుంది. అమరావతి విషయాన్ని తీసుకుంటే ఇంత నిధులు పెట్టి ఎందుకు ఖర్చు చేయడం అన్న ప్రశ్న జనసేనానిలోనూ ఉంది. కానీ అదే అమరావతి సక్సెస్ అయితే? అదే సంపద సృష్టించే కేంద్రంగా మారితే? అందుకే ఆయన ప్రతి విషయంలో మౌనం పాటించినట్లే రాజధాని అమరావతి నిర్మాణం విషయంలోనూ మౌనంగా ఉండాలని నిర్ణయించారట. మళ్లీ భూసేకరణపై... ఇటీవల చంద్రబాబు నాయుడు అమరావతి రైతులతో సమావేశమై మరో నలభై నాలుగు వేల ఎకరాల సమీకరణను చేయాలని, గ్రీన్ కోర్ ఎయిర్ పోర్టుతో పాటు అనేక వాటికి భూమి అవసరమని ఆయన రైతులతో చెప్పారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తొలుత సేకరించిన 33 వేల ఎకరాలే ఎందుకని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ దానికి తోడు నలభై నాలుగు వేల ఎకరాలు సేకరించాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని కూడా తప్పుపట్టలేదు. అలాగే బహిరంగంగా సమర్థించలేదంటున్నారు.

మనకు సంబంధం లేని విషయంగా ఆయన వ్యవహరిస్తున్నట్లే కనపడుతుంది. భవిష్యత్ లో బూమ్ రాంగ్ అయినా తాను సమర్థించలేదని చెప్పుకోవడానికి వీలవుతుందని సైలెంట్ గా ఉన్నారనిపిస్తుంది.. ఎంత సింహాచలం ఘటనపై... ఒక్క అమరావతి మాత్రమే కాదు.. ఏ ఘటన జరిగినా పెద్దగా ఆయన స్పందించడం లేదు. తిరుమలలో తొక్కిసలాట జరిగినప్పుడు అక్కడకు వెళ్లి ఊగిపోయిన పవన్ కల్యాణ్ నిన్న సింహాచలంలో గోడకూలి ఏడుగురు మరణిస్తే అక్కడకు వెళ్లకపోవడానికి కూడా కారణమదే అంటున్నారు. తాను అక్కడకు వెళితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాల్సి వస్తుందని, అందుకే అక్కడకు వెళ్లకుండా కామ్ గా ఉండి జరిగిన ఘటనను మాత్రం ఖండించారు. విచారాన్ని వెలిబుచ్చారు. పైగా హోంమంత్రి వంగలపూడి అనితను కూడా అక్కడ ఘటన జరిగిన తర్వాత తీసుకున్న చర్యలపై ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. దీన్ని బట్టి పవన్ కల్యాణ్ కొంత దూరంగా ఉంటూనే పరిస్థితిని బట్టి తన మూవ్ అవ్వాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుందని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.



# ఘనంగా బీఆర్ఎస్ నేత మురళీకృష్ణ యాదవ్ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**

బీఆర్ఎస్ యువ నాయకుడు వై.మురళీకృష్ణ యాదవ్ జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ బచ్చలి నరసింహ ఆధ్వర్యంలో స్థానిక సర్కార్ దావాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గ రాజకీయాల్లో అత్యంత ప్రతిభను కనబరుస్తూ సామాన్య ప్రజల మనస్సును దోచుకున్న నాయకుడు మురళీకృష్ణ యాదవ్ అని ఈ సందర్భంగా కొనియాడారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్లు యుగంధర్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, నాయకులు నందిగామ శ్రీనివాస్, కొండ మల్లేష్, సుశాంత్, పిట్టల మల్లేష్, పిల్లి సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు సరే.. ఆచరణ ఎప్పుడు?

- డిక్లరేషన్లు ఇచ్చిన నేతలు ఎక్కడ?
- చర్చనీయాంశంగా రాష్ట్ర ఆర్థికపరిస్థితి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04):**




తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితాల మీద ఉచితాలు ప్రకటించారు. ఏకంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియాగాంధీ లాంటి వారిని పిలిపించి డిక్లరేషన్లు ప్రకటించారు. కానీ వాటి అమలులో మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో రేవంత్ రెడ్డికి తెలుసు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే నాటి కెసిఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేసింది. గడువు ముగియకముందే ముందుగానే వైన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. తద్వారా అప్పటి ఎన్నికల్లో నెగ్గడానికి ప్రణాళికలు రూపొందించింది. కానీ ఆ ఎన్నికల్లో ప్రజలు వేరే విధంగా తీర్పు ఇవ్వడంతో భారత రాష్ట్ర సమితికి తల బొప్పి కట్టింది. ఇక నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. వాటిల్లో కొన్ని మాత్రమే అమలులో పెట్టింది. అమలు ఉన్న పథకాలు కూడా అంతంతమాత్రంగానే ప్రజలకు చేరువవుతున్నాయి. ఇక ఇదే విషయాన్ని ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి ప్రస్తావిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగుతోంది. ఇది ఊహించిన పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సరికొత్త పల్లవి అందుకుంది.ఇటీవల జరిగిన ప్రతి సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు. చివరికి ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే.. తెలంగాణ ఆర్టీసీ ఇప్పుడిప్పుడే బాగుపడుతోందని.. కార్మికులు సమ్మెకు దిగితే నష్టం తీవ్రంగా వాటిల్లుతుందని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఏమాత్రం బాగోలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నామని రేవంత్ రెడ్డి పదేపదే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగో లేనప్పుడు.. అని హామీలు ఎవరు ఇవ్వమన్నారు? ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించమని ఎవరు చెప్పారు? నాడు అవుటర్ రింగ్ రోడ్డు ను లీజుకు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని లెక్కలతో సహా వివరించారు. మరి అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు మొత్తం అమలు చేయాలంటే డబ్బులు ఉండాలనే విషయం రేవంత్ రెడ్డికి తెలియదా.. అంటే అధికారం కోసం ఎన్ని హామీలైనా ఇస్తారా? చివరికి ఓట్లు వేయించుకొని ప్రజలను వెర్రివాళ్లను చేస్తారా? అంటూ రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. ప్రతి సమావేశంలోనూ బడ్జెట్ పద్మనాభం లాగా లెక్కలు వేయడం.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం.. పరిపాటిగా మారిపోయిందని.. రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు.



# ఘనంగా ఎంపీ అరుణ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేసిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**

మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ జన్మదినం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పాపన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ, బూర్గుల చైతన్య ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అరుణ చల్లగా ఉండాలని వృద్ధులు దీవించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, లష్కర్ నాయక్, కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, చౌదరిగూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు, చేగు సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిద్దె గణేష్, రంగన్న గౌడ్, కుడుముల బాల్ రాజ్, ఆంజనేయులు, అనిల్ కుమార్ గౌడ్, శ్రీరామ్ రెడ్డి, రాజు నాయక్, కడవత్ రాజు, శ్రావణ్ కుమార్, నరేష్, గొల్ల రాజు, రవి తదితరులు ఉన్నారు.

# లోయలో జల్లెడ పడుతున్న ఎన్ఐఏ బలమైన ఆధారాలు సేకరణ

**జర్నలిస్ట్ డైరీ, న్యూఢిల్లీ(మే 04):**

పహల్గామ్ ఉగ్రదాడిపై ఎన్ఐఏ దర్యాప్తు వేగం పుంజుకుంది. బైసరన్ వ్యాలీకి మూడు కిలోమీటర్ల పరిధిలో ఘటన రోజు ఉన్న వారందరి నుంచీ దర్యాప్తు సంస్థ వివరాలు రాబట్టింది. ఉగ్రదాడి జరిగిన చోట త్రీడీ మ్యాపింగ్‌తో పాటు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసింది నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ. స్వయంగా డీజీ పహల్గామ్ చేరుకోవటంతో దర్యాప్తు సంస్థకు బలమైన ఆధారాలు దొరికినట్లే కనిపిస్తోంది. ఇన్వెస్టిగేషన్‌లో బయటపడ్డ అంశాలతో కేంద్ర హోం మంత్రిత్వశాఖకు సమగ్ర నివేదిక సమర్పించబోతోంది ఎన్ఐఏ. .. పహల్గామ్ సమీపంలోని బైసరన్‌లో జరిగిన ఉగ్ర దాడిని ఛేదించేందుకు అన్ని కోణాల్లో ఎంక్వైరీ చేస్తోంది ఎన్ ఐఏ. ఎటాక్ జరిగిన స్పాట్‌కి అత్యాధునిక పరికరాలతో వెళ్లారు అధికారులు. ఆల్ టెర్రయిన్ వెహికిల్స్, ఘటనాస్థలికి వెళ్లి దర్యాప్తును స్పీడప్ చేశారు. బైసరన్ లోయలో 3D మ్యాపింగ్ చేశారు. ఇప్పటివరకు సేకరించిన ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం ఆధారంగా త్రీడీ మ్యాపింగ్‌తో పాటు, సీన్ రీకన్‌స్ట్రక్షన్ ప్రక్రియ చేపట్టారు. ఉగ్రవాదుల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లపై కచ్చితమైన వివరాలు సేకరిస్తున్నారు ఎన్ఐఏ అధికారులు. ఇప్పటి వరకు వందలాది మంది వాంగ్మూలాలను నమోదు చేసిన అధికారులు.. ఫొటోగ్రాఫర్లు, డ్రైవర్లు, జిప్ రైడర్స్‌తో పాటు పోనీ రైడర్స్‌ను ప్రశ్నించారు. కొందరు టూరిస్టులపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ.. వాళ్లనూ ఇంటరాగేట్ చేశారు. త్రీడీ మ్యాపింగ్‌తో ఉగ్రవాదులు ఎక్కడి నుంచి పహల్గామ్‌కు వచ్చారనేది తెలుసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మరోవైపు కశ్మీర్‌లో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించాయి నిఘా వర్గాలు. ఉగ్రవాదుల ఇళ్లను భద్రతా బలగాలు పేల్చి వేస్తుండటంతో.. దానికి ప్రతీకారంగా దాడులకు దిగే అవకాశం ఉందని సూచించాయి. ఇక కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న 87 పర్యాటక కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేశారు. ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ సరస్సు ప్రాంతాల్లో భద్రతా దళాలు, లోకల్ పోలీసులు, ప్రత్యేక బృందాలు మోహరించాయి. పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిపై ఉగ్రవాద నిరోధక సంస్థ జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమిక నివేదిక పాకిస్తాన్ నిఘా సంస్థ, ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ , ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా మధ్య సంబంధాన్ని సూచిస్తుందన ఎన్ ఐఏ వర్గాలు తెలిపాయి.ఎన్ ఐఏ వర్గాల సమాచారం ప్రకారం, 26 మందిని, ప్రధానంగా పర్యాటకులను చంపిన ఉగ్రవాద దాడి వెనుక కుట్ర, సీనియర్ ISI నిర్వహకులు జారీ చేసిన ఆదేశాల మేరకు LeTలోనే ప్రణాళిక రచించినట్లు ఎన్ ఐఏ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రణాళిక పాకిస్తాన్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో అధికారికంగా రూపొందించినట్లు అనుమానిస్తున్నారు. దాడికి కేంద్రంగా ఉన్న ఇద్దరు ఉగ్రవాదులు హష్మీ ముసా (అలియాస్ సులేమాన్), అలీ భాయ్ (అలియాస్ తల్హా భాయ్) పాకిస్తాన్ జాతీయులుగా నిర్ధారించారు. అదుపులోకి తీసుకున్న కార్యకర్తల విచారణలో, దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో స్థిరమైన సంభాషణను కొనసాగించారని, సమయం, లాజిస్టిక్స్, అమలుపై నిర్దిష్ట సూచనలు అందుకున్నారని తేలింది. దాడికి వారాల ముందు ఉగ్రవాదులు భారత భూభాగంలోకి ప్రవేశించారని, వారికి ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ నెట్‌వర్క్ సహాయం చేసి, ఆశ్రయం, నావిగేషన్, నిఘా వంటి స్థానిక లాజిస్టికల్ మద్దతును అందించిందని ఎన్ ఐఏ వర్గాలు భావిస్తున్నాయి.



ఎన్ ఐఏ విస్తృతమైన ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ డేటా సేకరణను నిర్వహించింది. నేరస్థలం నుండి స్వాధీనం చేసుకున్న 40 కి పైగా కార్ట్రిడ్జ్‌లను బాలిస్టిక్, రసాయన విశ్లేషణ కోసం పంపారు. దాడి జరిగిన ప్రదేశం 3D మ్యాపింగ్‌ను కూడా నిర్వహించారు మరియు లోయ చుట్టూ ఉన్న మొబైల్ టవర్ల నుండి డంప్ డేటాను సేకరించారు. దాడికి ముందు రోజుల్లో ఈ ప్రాంతంలో ఉపగ్రహ ఫోన్ కార్యకలాపాలు పెరిగాయి. బైసారన్, చుట్టుపక్కల కనీసం మూడు ఉపగ్రహ ఫోన్లు పనిచేస్తున్నాయి. రెండింటి నుండి వచ్చిన సంకేతాలను గుర్తించిన ఎన్ఐఏ అధికారులు విశ్లేషించారు.మొత్తం మీద, ఎన్ ఐఏ భద్రతా సంస్థలు 2,800 మందికి పైగా వ్యక్తులను ప్రశ్నించాయి. మే 2 నాటికి, 150 మందికి పైగా వ్యక్తులు తదుపరి విచారణ కోసం కస్టడీలో ఉన్నారు. వీరిలో అనుమానితులు, జమాతేఇస్లామి వంటి నిషేధిత గ్రూపులు, హురియత్ కాన్ఫరెన్స్‌లోని వివిధ వర్గాలతో సంబంధాలు ఉన్న వ్యక్తులు ఇద్దరూ ఉన్నారు. కుప్వారా, పుల్వామా, సోపోర్, అనంత నాగ్, బారాముల్లా సహా పలు జిల్లాల్లో దాడులు జరిగాయి. సరిహద్దు ఉగ్రవాద మౌలిక సదుపాయాలకు సహాయం చేస్తున్నట్లు అనుమానిస్తున్న అనేక మంది వ్యక్తుల నివాసాలను సోదాలు చేశారు. 1999 IC814 హైజాక్ కేసులో కీలక వ్యక్తి, ప్రస్తుతం పాకిస్తాన్ నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భావిస్తున్న ముష్తాక్ అహ్మద్ జర్గర్ అలియాస్ లాట్రమ్ నివాసంలో సోదాలు జరిగాయి. జర్గర్ శ్రీనగర్ నివాసాన్ని గతంలో 2023లో కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద అటాచ్ చేశారు.దాడి చేసిన వారి కదలికలను తెలుసుకోవడానికి పహల్గామ్ చుట్టుపక్కల ఉన్న కీలక రవాణా, ప్రజా ప్రాంతాల నుండి సీసీటీవీ ఫుటేజ్‌లను ఎన్ ఐఏ స్వాధీనం చేసుకుంది. ప్యాటర్న్ మ్యాపింగ్ కోసం వారు పరిసర ప్రాంతాలలోని భద్రతా తనిఖీ కేంద్రాల నుండి డేటాను కూడా సమీక్షిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, పోనీ ఆపరేటర్లు, ఆహార విక్రేతలు సహా డజన్ల కొద్దీ ప్రత్యక్ష సాక్షులు దాడి రీగన్‌ట్రక్షన్ చేయడానికి సాక్ష్యాలను అందించారు. చాలా మంది దాడి చేసినవారు బాడీమౌంటెడ్ కెమెరాలను ఉపయోగిస్తున్నారని, బహుశా ప్రచార ప్రయోజనాల కోసం సంఘటనను రికార్డ్ చేయడానికి అని భావిస్తున్నారు. ఈ ఖాతాలు ఫోరెన్సిక్ పరిశీలనలో ఉన్నాయి.2024లో గండేర్బల్ జిల్లాలోని సోనామార్గ్‌లోని Zమోర్హ్ సొరంగం సమీపంలో జరిగిన ఉగ్రవాద దాడికి, ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు సహా ఏడుగురు వ్యక్తులు మరణించిన పహల్గామ్ హత్యలకు మధ్య సంబంధాలను ఎన్ ఐఏ గుర్తించింది. ఈ దాడిలో ఎల్ఇటి మద్దతుగల అదే యూనిట్‌కు చెందిన ఆపరేటర్లు రెండు దాడులను నిర్వహించినట్లు భావిస్తున్నారు. 2024 డిసెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుర్తించిన ఒక కార్యకర్త జునైద్ అహ్మద్ భట్ హతమయ్యాడు. ఇప్పుడు హాషీం ముసాగా గుర్తించిన మరో అనుమానితుడు రెండు దాడుల్లో పాల్గొన్నట్లు సమాచారం.



## షాద్ నగర్ నియోజకవర్గంలో బీసీ సేన మహిళ కమిటీలు

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**

రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం బీసీ సేన మహిళ అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు సదర్ శ్రీను షాద్నగర్ నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, ఫరూఖ్ నగర్ మండలం అధ్యక్షులు మేకల వెంకటేష్, జిల్లేడు చౌదర్ గూడ మహిళ అధ్యక్షురాలు జయ శ్రీకాంత్, నందిగామ ఉపాధ్యక్షులు మొలగసి నర్సింలు, ఫరూఖ్ నగర్ ఉపాధ్యక్షురాలు ఏ.స్రవంతి ఈ సందర్భంగా చింతగూడెం గ్రామ అధ్యక్ష, కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా కమిటీని ఉద్దేశించి నియోజకవర్గ అధ్యక్షురాలు బాస వరలక్ష్మి మాట్లాడుతూ.. చింతగూడెం గ్రామంలో మండల అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహిళలు బీసీ సేన పట్ల చూపిస్తున్న ఆదరణ ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. బీసీలు కులాలలకు అతీతంగా పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదములు తెలిపారు.



## కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

- **కారు డ్రైవర్ తో సహా ఇద్దరు మృతి మరో ఇద్దరికి గాయాలు**

**జర్నలిస్ట్ డైరీ, మేడ్చల్-మల్కాజ్‌గిరి (మే 04) :**

నైట్రోజన్ కంటైనర్ ను వేగంగా దూసుకువచ్చి వెనుక నుంచి కారు ఢీకొట్టిన సంఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షామీర్ పేట్ నుంచి కీసర మీదుగా ఘట్కేసర్ వైపు వెళ్తున్న నైట్రోజన్ కంటైనర్ ను వెనకాల అతి వేగంగా వచ్చిన టీజీ07జే 3256 బెలోనా కారు ఢీకొంది. కారులోని డ్రైవర్ తో సహా ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కారు వెనుకా సీట్ లో కూర్చున్న ఇద్దరికి గాయాలు గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఘట్ కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నవవధువు ఆత్మహత్య

**జర్నలిస్ట్ డైరీ, నల్గొండ (మే04):**



పెళ్లి అయిన ఐదు రోజులకే నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో చోటుచేసుకుంది. హుజూర్ నగర్ ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హుజూర్ నగర్ పట్టణానికి చెందిన షేక్ ఖసీంబీ తన కుమార్తె షేక్ మహబూబి, @ హసీనా (19) గత నెల ఏప్రిల్ 30న చింతలపాలెం గ్రామానికి చెందిన షేక్ యూసఫ్ కు ఇచ్చి వివాహం చేశారు. ఈ నెల 3 శనివారం తన భర్త షేక్ యూసఫ్ తో కలిసి పుట్టింటికి వచ్చిందని తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో మృతురాలు బాత్ రూంలో స్నానానికి వెళ్లి ఇనుప కడ్డీకి ఉరి వేసుకుని చనిపోయిందని తెలిపారు. తల్లి ఖాసీంబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## క్షణికావేశంతో ప్రేమ జంట ఆత్మహత్య

**జర్నలిస్ట్ డైరీ, మహబూబ్ నగర్ (మే04):**



క్షణికావేశంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలంలో తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటన పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న రేవల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎట్టి జంగయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు ఎట్టి శివప్రసాద్ (17) గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరిద్దరికీ వయస్సు లేకపోవడంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి, వచ్చే సంవత్సరం పెళ్లి చేస్తామని బుజ్జగించారు. ఆదివారం మధ్యాహ్నం ఏమైందో తెలియదు కానీ.. ముందుగా యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎట్టి శివప్రసాద్ మొదంపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలోని పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్న వయసులో ఇద్దరు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోలీసులు జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. యువకుడి తండ్రి జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువుల సుందరీకరణకు చొరవ

- **పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 04) :**




శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువులకు మహర్దశ పట్టడం ఖాయమని పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. మియపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్స్ మాల్స్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరీకరణతో స్వచ్ఛమైన వర్షపు జలసిరులను ఒడిసిపడుదామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని, జీవ వైవిధ్యం పెరుగుతుందని, పక్షుల వలసలు మొదలు అవుతాయని అన్నారు. పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే నా లక్ష్యం అని తెలియచేశారు. చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్, ఐజీయూఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ చేపట్టుటకు ముందుకు రావడం చాలా అభినదించదగ్గ విషయమని అన్నారు. చెరువు చుట్టుపక్కల కాలనీ వాసులు, ప్రజలు చెరువును సంరక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా సామాజిక బాధ్యతతో సంరక్షించుకోవాలని, చెరువుల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడ్డగోలు నిర్మాణాలు

- **ప్రభుత్వ భూమిలో దర్జాగా కట్టడాలు**
- **రెచ్చిపోతున్న కబ్జా రాయుళ్లు**
- **మామూళ్ల మత్తులో తూగుతున్న అధికారులు**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 03):**



భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించి ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఇదే అదనుగా భావించి సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలను, భవనాలను ఏర్పాటు చేసుకొని దర్జాగా లబ్దిపొందుతున్నారు.. దీనిని నివారించాల్సిన గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో ఊగిపోతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు...పైగా రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ అధికారులను బెదిరిస్తూ దర్జాగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలు, భవనాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ఇదేమిటని అడిగే నాథుడు లేకపోవడంతో వారు అడిందే ఆట పాడిందే పాటలా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే..కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్ గ్రామ శివారులోని గేట్ వద్ద సర్వే నంబర్ 54లో గల ప్రభుత్వ భూమిని గతంలో వీరేశం యాదవ్ అనే వ్యక్తికి సాగు చేసుకోవడానికి కొంత భూమిని కేటాయించారు. కాగా గత నాలుగైదు సంవత్సరాల క్రితం సదరు లబ్దిదారుడు ఆ భూమిని సాగు చేయకుండా ఆ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా భవనం నిర్మించుకున్నారు.అంతేగాకుండా రేకులతో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయికి ఇవ్వడం జరిగింది. ఈ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు కూడా తీసుకోకుండా తనను అడిగేవారు లేరంటూ దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇందుకు తగ్గట్టు సంబంధిత అధికా రులు సైతం అతనికే వత్తాసు పలకడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. ప్రభుత్వం కేటాయించిన భూమిలో కేవ లం సాగు మాత్రమే చేసుకోవాలనేది నిబంధన. ఒకవేళ లబ్దిదారుడు సాగు చేసుకోని పక్షంలో ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీ నం చేసుకోవాలి. కానీ ఇక్కడ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో సద రు లబ్ది దారుడు దర్జాగా భవనాన్ని నిర్మించడమే కాకుండా వాణిజ్య దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని కావల్సినంత రాబడి పొందుతున్నాడు.ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. ఎందుకని ఆరా తీస్తే కిందిస్థాయి నుండి ఎమ్మెల్యే వరకు అండదండలు ఉన్నాయని అధికారులే చెప్ప డం విశేషం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన అతనిపై చర్యలు తీసుకోక పోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదుపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు తీసు కోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మామూళ్ళకు తలొగ్గి అక్రమ నిర్మా ణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు నేరం

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసినట్లు మా దృష్టికి రాలేదు. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అయినా ప్ర భుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం నేరం. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, వ్యాపారం చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటాంనోటీసులు జారీ చేస్తాం సర్వే నంబర్ 54లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన విషయంలో విచారణ చేపడుతున్నాం. వీరేశం యాదవ్కు నోటీసులు జారీ చేస్తాం. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు




## అగమ్యగోచరంగా విద్యార్థుల భవిష్యత్తు

- **రూ. 800 కోట్లు తక్షణం చెల్లించండి**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హరీశ్ రావు**

జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04): డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచడంలో పడిందని మాజీమంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి, విద్యార్థుల పాలిట శాపంగా మారిందని..వారి చదువును, జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆరోపించారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సకాలంలో పరీక్ష నిర్వహించకపోవడంతో పీజీ సెట్, లా సెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతగానితనమే అని విమర్శించారు. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని పేర్కొన్నారు. రీయింబర్స్‌మెంట్ లేక యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు అప్పులు తెచ్చి బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అద్దెలు, అప్పులు పెరిగిపోవడంతో ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లను నిలిపివేయగా, కొన్నిచోట్ల కళాశాలలకు తాళం వేసి ఇప్పటికే సెలవులు ప్రకటించారని తెలిపారు. ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు సీఎం, మంత్రులు వ్యవహరిస్తుండడం సిగ్గుచేటని పేర్కొన్నారు. యువ వికాసం పేరుతో ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో పెట్టారని, దానికి అతీగతి లేదని తెలిపారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ చెప్పిన మాటలు గాలి మాటలే అయ్యాయని ఆరోపించారు.

# ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

- **ఈ నెల 21 వరకు తొలి విడత**
- **మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు**




**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్, (మే 04):** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 202525 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్ మే 2న వెలువడిన విషయం తెలిసిందే. జూన్ 23 వరకు మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగనుంది. విద్యార్థులు మొదటి విడతలో రూ.200 చెల్లించాలి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇక రెండు, మూడో విడతల్లో రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. 21 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు నిర్వహించి, మే 10 నుంచి 22 వరకు వెబ్ఆప్షన్లకు అవకాశం ఇవ్వనున్నారు. విద్యార్థులకు మే 29న సీట్లను కేటాయించనున్నారు. అదేవిధంగా మే 30 నుంచి జూన్ 8 వరకు రెండో విడత రిజిస్ట్రేషన్లు నిర్వహించి, మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ఆప్షన్లకు అవకాశం కల్పించనున్నారు. రెండో విడత సీట్లను జూన్ 13న కేటాయించనున్నారు. ఇక చివరి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూన్ 13 నుంచి 19 వరకు నిర్వహించి.. జూన్ 13 నుంచి 19 మధ్య వెబ్ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చు. వీరికి జూన్ 23న సీట్లను కేటాయించనున్నారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తర్వాత జూన్ 30 నుంచి డిగ్రీ కాలేజీల్లో తరగతులు ప్రారంభంకానున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గత విద్యాసంవత్సరానికి సంబంధించి 'దోస్త్' ప్రవేశాల పరిధిలో రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలో 1054 డిగ్రీ కాలేజీలుండగా, వాటిలో 136 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, నాన్ దోస్త్ కాలేజీలు 63 ఉన్నాయి. మిగిలినవి ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,86,544 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ తదితర కోర్సుల్లోని సీట్లను దోస్త్ ద్వారా భర్తీచేస్తారు.

**దోస్త్ 2025 షెడ్యూలు..**

మొత్తం మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నారు. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం హానర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీబీఎం, బీసీఏతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

మొదటి దశ ప్రవేశాలు ఇలా..

- ఈ నెల 21 వరకు దోస్త్ మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు.
- రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు.
- విద్యార్థులకు మే 29న మొదటి విడత డిగ్రీ సీట్లను కేటాయించనున్నారు.

రెండో దశ ప్రవేశాలు ఇలా..

- రెండో విడత దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది.
- రెండో విడత వెబ్ ఆప్షన్లకు మే 30 నుంచి జూన్ 9 వరకు అవకాశం కల్పించనున్నారు.
- విద్యార్థులకు జూన్ 13న రెండో విడత డిగ్రీ సీట్లను కేటాయిస్తారు.

మూడో విడత ప్రవేశాలు ఇలా..

- దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూన్ 13న ప్రారంభంకానుంది.
- విద్యార్థులు జూన్ 19 వరకు దరఖాస్తులు సమర్పించాలి.
- చివరి విడత వెబ్ ఆప్షన్లకు జూన్ 13 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు.
- విద్యార్థులకు జూన్ 23న మూడో విడత డిగ్రీ సీట్లను కేటాయిస్తారు.
- జూన్ 30 నుంచి కళాశాలల్లో తరగతులు ప్రారంభంకానున్నాయి.

## పెంపుడు కుక్క కరవడంతో వ్యక్తి మృతి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (మే 04) :** పెంపుడు కుక్క కరవడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. డి.పవన్ కుమార్ (37) తన స్నేహితుడు సందీప్‌తో కలిసి గత ఐదేళ్ళుగా మధురానగర్ లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. పవన్ కుమార్ ప్రైవేటుసంస్థలో క్యాషియర్గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యం కారణంగా వెళ్ళడం లేదు. ప్రతిరోజు ఆసుపత్రికి స్నేహితునితో కలిసి వెళ్ళి వస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా ఆసుపత్రికి వెళ్ళి రాత్రి దాదాపు 11 గంటల సమయంలో తన గదిలోకి వెళ్ళి నిద్రపోయాడు. పక్కనే అతని పెంపుడు కుక్క కూడా పడుకుంది. ఉదయం సందీప్ తలుపు తట్టగా పవన్ లేవలేదు. దాంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారిని పిలిపించి తలుపు పగలకొట్టి లోనికి వెళ్ళగా పవన్ చనిపోయి ఉన్నాడు. అతని మర్మాంగాలు రక్తంతో ఉన్నాయి. అతని పెంపుడు కుక్క నోటినిండా రక్తం ఉంది. దాంతో కుక్క అతని మర్మాంగాలు తినడం వల్లనే మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు.

# అసలు కారణం ఇదా!

- **మోదీ పర్యటనకు అందుకే దూరమా?**



**జర్నలిస్ట్ డైరీ, గుంటూరు(మే 04):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రధాని మోదీ పర్యటనకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే జగన్ తీసుకున్న నిర్ణయం ఎంత వరకూ కరెక్ట్ అన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తుంటే ప్రధాని మోదీని కలిసే అవకాశాన్ని జగన్ తనంతట తానే వదులుకున్నారని కొందరు అంటున్నారు. అదే సమయంలో దూరంగా ఉండటమే మేలన్న అభిప్రాయమూ వ్యక్తమవుతుంది. రాజధాని అమరావతి పనులకు శంకుస్థాపనలు చేయడానికి ప్రధాని మోదీ వచ్చారు. అమరావతికి చేరుకుని కేవలం గంట నుంచి రెండు గంటలు మాత్రమే జగన్ తాడేపల్లిలోని తన ఇంట్లోనే ఉన్న జగన్ గురువారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లడంతో ఆయన ప్రధాని మోదీ పర్యటనకు హాజరు కూకడదని నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతుంది. ప్రొటోకాల్ అధికారులు జగన్ కు ప్రధాని మోదీ సభకు రావాలని ఆహ్వాన పత్రికను అందించడానికి తాడేపల్లి ఇంటికి వెళ్లినా జగన్ అందుబాటులో లేరని చెప్పడంతో దానిని ఆయన పీఏకు ఇచ్చి వచ్చారు.. సాయంత్రం 5.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి రాత్రి ఎనిమిది గంటలకు బెంగళూరుకు చేరుకోనుకున్నారు. జగన్ ప్రధాని మోదీ పర్యటనకు దూరంగా ఉండటానికి అనేక కారణాలున్నాయి. మామూలుగా పర్యటనకు వస్తే హాజరయినా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ తాను వ్యతిరేకించిన చోట అదే.. రాజధాని నిర్మాణాన్ని ఐదేళ్ల పాటు పక్కన పెట్టి, మూడు రాజధానులంటూ నినాదాన్ని అందుకున్న తాను ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి జగన్ వచ్చి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. ఒకవేళ ప్రధాని నరేంద్ర మోదీ కోసం వెళ్లి అవమానాల పాలు కావాల్సి వస్తుందేమోనన్న భయం కూడా జగన్ లో ఉంది. అందులోనూ తనకు నచ్చని, మెచ్చని అమరావతి పనులను ప్రారంభించే పనులకు హాజరైతే భవిష్యత్ లో రాజధాని విషయంలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి కుదరదన్న భావనతోనే జగన్ దూరంగా ఉన్నారని అంటున్నారు. జగన్ గా తాను వెళ్లినా.. వెళ్లకపోయినా అక్కడ పట్టించుకునే వారు పెద్దగా ఉండరు. అదే సమయంలో తాను హాజరయితే గత ఐదేళ్లు తాను చెప్పిన దానికి విలువ లేకుండా పోతుంది. మూడు రాజధానులంటూ వచ్చి అమరావతి పనుల నిర్మాణానికి ఎలా వచ్చారంటూ భవిష్యత్ లో జగన్ ను ప్రశ్నించే అవకాశం కూడా ఉంటుంది. అందుకే జగన్ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి దూరంగా ఉండటమే మేలు అని నిర్ణయించుకుని ఒకరోజు ముందుగానే బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. రానున్న కాలంలో అమరావతి లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తనకు సంబంధం లేదన్న విషయాన్ని ఆయన స్పష్టం చేయడానికి అవకాశం దొరుకుతుందని కూడా అంచనా వేసుకుని ఆయన విమానమెక్కి వెళ్లిపోతున్నారట.

# మరో ప్రతిష్టాత్మక సదస్సుకు కేటీఆర్



- **ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ఆహ్వానం**
- **యూనివర్సిటీలో 2025 జూన్ 20, 21 తేదీల్లో సమావేశాలు**
- **పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, ప్రొఫెసర్లు, వివిధ దేశాల నిపుణులు హాజరు**
- **ఇండియా సాధిస్తున్న ప్రగతిని వివరించనున్న కేటీఆర్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 04):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు మరో ప్రతిష్టాత్మక సమావేశానికి హాజరుకానున్నారు. 2025 జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్ లో జరిగే ఆక్స్ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్య వక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్ ను ఆహ్వానించింది. "భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు" అనే థీమ్ తో ఈ సంవత్సరం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్దార్థ్ సేఠ్ తెలిపారు. కెటిఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణుల సమక్షంలో భారతదేశ ప్రగతిపథాన్ని, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్ను కేటీఆర్ వివరించనున్నారు. ఈ సదస్సులో కేటీఆర్ పాల్గొంటే రాబోయే రోజుల్లో ప్రపంచం పై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చాటొచ్చని సిద్ధార్థ్ సేఠ్ తెలిపారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్థ్ కోరారు. ఆక్స్ఫర్డ్ ఇండియా ఫోరమ్ సమావేశం యూరప్లో భారత్కు సంబంధించిన అతి పెద్ద కార్యక్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చూపే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. భారత్‌ను ప్రపంచానికి దగ్గర చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం.

# ఈ మామిడి కాయల కోసం బౌన్సర్లు

- **కిలో మూడు లక్షల పైమాటే**



**జర్నలిస్ట్ డైరీ, ఖమ్మం(మే 04):** కిలో మామిడి పండ్ల రేటు ఎంత ఉంటుంది..? రూ.200 లేదా రూ.300 రూపాయలు ఉంటుంది. కానీ ఒక్కసారి ఊహించుకోండి... ఒక కిలో మామిడి పండ్ల ధర అక్షరాలా మూడు లక్షల రూపాయలు.. పలుకుతోంది. వినడానికి ఎంతో ఆశ్చర్యంగా ఉంది కదూ? అంత పెద్ద మొత్తంలో ధర పలకడానికి ఆ మామిడి పండ్లలో అంత ప్రత్యేకత ఏముందో తెలుసుకోవాలని ఉందా..? అయితే దీనిని మీరు కచ్చితంగా తెలుసుకోవాల్సిందే.. ఆ అరుదైన మామిడి పండ్లనే 'మియాజాకీ' అంటారు. వాటికున్న డిమాండ్‌ను బట్టి ధర ఒక్కోసారి కిలో మూడు లక్షల రూపాయల వరకు పలుకుతుంది.ఈ అద్భుతమైన విషయాన్ని తెలుసుకున్న ఖమ్మం నగరానికి చెందిన ఓ రైతు కరోనా లాక్‌డౌన్ సమయంలో ఒక ఆసక్తికరమైన ఆలోచన చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంత డిమాండ్ ఉన్న ఈ మామిడిని మన నేలపై పండిస్తే ఎలా ఉంటుందని ఆలోచించి వెంటనే రంగంలోకి దిగారు. మధ్యవర్తుల ద్వారా కాలిఫోర్నియా నుండి ఒక్కో మొక్కను అక్షరాలా 12 వేల రూపాయలు వెచ్చించి మరీ 30 మొక్కలను దిగుమతి చేసుకున్నాడు. 2020లో నాటిన ఈ మొక్కలు ఇప్పుడు బంగారు పంటను పండిస్తున్నాయి.ఆ రైతు చెప్పిన వివరాల ప్రకారం.. ఒక్కో చెట్టుకు 2024లో 30 కాయలు కాగా, 2025లో ఏకంగా 80 కాయలు కాశాయి. ఒక్కో కాయ బరువు దాదాపు 500 గ్రాములు ఉంటుందట.. ఇతర మామిడి రకాల కంటే ఇది నెల ముందుగానే పూత, కాతకు రావడం మరో విశేషం. ఇక్కడి నేల ఈ పంటకు అనుకూలంగా ఉండటంతో.. రెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని కడియం నర్సరీ నుండి ఒక్కో మొక్కను 3,500 రూపాయల చొప్పున మరో 120 మొక్కలను కూడా కొనుగోలు చేశారు. అదనంగా మరో ఎకరం విస్తీర్ణంలో ఈ సాగు చేపట్టగా, ప్రస్తుతం వచ్చిన పండ్లను కేవలం కుటుంబ అవసరాల కోసం మాత్రమే ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన పంటను త్వరలోనే మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నాడు. మియాజాకీ మామిడి రకాన్ని పండిస్తోన్న కాకినాడ రైతు.. కేజీ రూ.2.7 లక్షలుజిల్లా ఉద్యాన అధికారులు ఈ అరుదైన మామిడి రకం గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ప్రతి సంవత్సరం నవంబర్ నుండి డిసెంబర్ మధ్యలో ఈ తోట పూతకు వస్తుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ పండ్ల ధర కిలో 2.50 లక్షల నుండి 3 లక్షల రూపాయల వరకు పలుకుతాయన్నారు. రాష్ట్రంలో బహుశా ఈ ఒక్క రైతు మాత్రమే ఈ రకం మామిడిని సాగు చేస్తున్నారని భావిస్తున్నారు.

ఈ రకమైన మామిడి రసం పీల్చే పురుగులు (తామర పురుగులు, నల్లి) మరియు ఆకుమచ్చ వంటి తెగుళ్లకు త్వరగా గురవుతుంది. ఈ పండ్లకు ఇంత అధిక ధర ఉండటానికి ప్రధాన కారణం వాటి ప్రత్యేకమైన రుచి, క్రీమీ ఆకృతి.. పరిమిత ఉత్పత్తి. ఇవి ముదురు ఎరుపు లేదా ఊదా రంగులో ఉండి చాలా తియ్యగా ఉంటాయి. అంతేకాదు.. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు (సి, ఇ, ఎ, కె).. ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.మియాజాకీ మామిడి రకం మొట్టమొదటగా 1984లో జపాన్‌లోని మియాజాకి ప్రాంతంలో పండించబడింది. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. ప్రస్తుతం జపాన్‌లోనే వీటిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. మన దేశంలో కూడా పంజాబ్‌కు చెందిన ఒక రైతు ఈ రకం మామిడిని సాగు చేసి, వాటి భద్రత కోసం బౌన్సర్లను నియమించిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి మీకు గుర్తుండే ఉంటుంది.



## మండలంలో ప్రశాంతంగా జరిగిన నీట్ పరీక్షలు

**జర్నలిస్ట్ డైరీ, సరూర్ నగర్,(మే04):** సరూర్ నగర్ మండల పరిధిలోని 4 పరీక్ష కేంద్రాలలో మొత్తం 1560 మంది విద్యార్థులు ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగా రాసారు. ఎల్బీనగర్ ప్రభుత్వ హైస్కూల్లో 240 మంది విద్యార్థులు గాను ఐదుగురు పరీక్షకు హాజరు కాలేదు. సరూర్నగర్ జూనియర్ కాలేజీలో 240 మంది విద్యార్థులకు 8 మంది విద్యార్థులు హాజరు కాలేదు. అలాగే సరూర్నగర్ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో 480 మంది గాను, 6 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. మిదాని పరిధిలో నీట్ పరీక్షలు రాసే ఆరు వందల మందికి ఆరుగురు విద్యార్థులు హాజరుకాలేదని, కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్ సిబ్బంది పటిష్టంగా బందోబస్తు నిర్వహించారని సరూర్నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు.



## బెల్టుషాపులపై దాడులు చేసిన పోలీసులు

- **రూ.30 వేల విలువైన మద్యం స్వాధీనం**

**జర్నలిస్ట్ డైరీ, కరీంనగర్ (మే04):** గంగాధర మండల పరిధిలో అక్రమంగా బెల్టు షాపులను నిర్వహిస్తే సహించేది లేదని ఎస్‌హెచ్ఓ పీఎస్ఐ స్వాతి తెలిపారు. ఆదివారం అక్రమ బెల్ట్ షాపులపై పోలీసులు సాయంత్రం విస్తృత దాడులు నిర్వహించారు. గంగాధర పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో పెద్ద ఎత్తున మద్యంను పట్టుకున్నారు. తనిఖీల్లో దార్ల రాజేశం షాపు షాపులో దాదాపుగా 24 లీటర్లు, అఖిల చికెన్ సెంటర్ వద్ద దాదాపుగా 18 లీటర్లు, కిషన్ షాపులో దాదాపుగా 7 లీటర్లు, అనుపమ చికెన్ సెంటర్ వద్ద దాదాపుగా 23 లీటర్లు, హిమ్మత్‌నగర్‌లోని నారాయణ షాపులో దాదాపుగా 12 లీటర్లు మొత్తంగా దాదాపుగా 84 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు ఎస్సై స్వాతి వివరించారు. ఈ మద్యం విలువ దాదాపు రూ. 30 వేలుగా ఉందని అన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## విద్యుత్ వైర్లు తెగి భారీ అగ్ని ప్రమాదం

- **రూ.8లక్షల మేర ఆస్తి నష్టం**

**జర్నలిస్ట్ డైరీ, కరీంనగర్ (మే04):** ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి మంటలు అంటుకొని భారీ ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన గొల్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని మాడల్ స్కూల్ సమీపంలోని అర్చనపెల్లి పద్మ ఇంటి దగ్గర గొల్లపల్లి నుండి వెనుగుమట్ల వెళ్లే 11 కేవీ విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తేగి కింద పడి భారీగా మంటలు చెలరేగడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో వెంటనే అప్రమత్తమైన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పాటు మంటలను సకాలంలో ఆర్పి వేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ఈ ఘటనలో టాటా ఏస్, స్కూటీ తో పాటు ఇంటి ఆవరణలో అరబోసిన 25 క్వింటాల మొక్కజొన్న పంట పూర్తిగా కాలి రూ.8 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు పద్మ తెలిపింది.

## లోక్ అదాలత్ ను సద్వినియోగించుకోవాలి

- **వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత**



**జర్నలిస్ట్ డైరీ, మహబూబ్ నగర్ (మే04):** ప్రత్యేక లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగించుకోవాలని వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత సూచించారు. మే 5వ తేదీ నుంచి మే 19 వ తేదీ వరకు నిర్వహించే ముందస్తు లోక్ అదాలత్, జూన్ 9వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్ ల ద్వారా చెక్కు బౌన్స్ కేసులను పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాలలో రాజీకి ఆమోదయోగ్యమైన కేసులకు సంబంధించిన ఇరువర్గాలు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సేవా అధికార సంస్థ వారికి సంబంధించిన కేసు వివరాలు తెలుసుకొని, ఇరువర్గాలను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకి పిలిపించి న్యాయవాదుల సమక్షంలో లేదా మధ్యవర్తిత్వం నిర్వహించి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నం చేస్తుందని, ఇరువర్గాలకు అవార్డు లిఖితపూర్వకంగా కేసు పూర్తయినట్టుగా (అవార్డు) ఆదేశాలు తక్షణమే అందజేసేట్టుగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కృషి చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.



# నా జీవితంలోకి దారి చూపినందుకు ధన్యవాదాలు అంటూ లవ్ సింబల్ జోడించి రష్మిక మందన్న పోస్ట్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీకి ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్‌లో విపరీతమైన క్రేజ్ ఉంది. కెరీర్ స్టార్టింగ్‌లో చిన్న సినిమాల్లో నటించినప్పటికీ.. ఆ మూవీస్ కూడా మంచి టాక్ సొంతం చేసుకున్నాయి. తర్వాత ఏకంగా స్టార్ హీరోలైన టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అండ్ బాలీవుడ్ ప్రముఖ హీరో అయిన రణబీర్ కపూర్ సరసన యానిమల్ చిత్రంలో అవకాశం దక్కించుకుని.. మరింత స్టార్ డమ్ సంపాదించుకుంది.

రణబీర్ కపూర్‌కు భార్యగా.. పుష్ప మొదటి భాగంలో ఐకాన్ స్టార్‌కు ప్రేయసిగా.. సెకండ్ పార్ట్‌లో భార్యగా నటించి ఉత్తమ నటిగా పేరు గాంచింది. ప్రస్తుతం అత్యధిక రెమ్యునరేషన్ అందుకుంటోన్న నటీమణుల్లో రష్మిక మందన్న ఒకరని చెప్పుకోవచ్చు. ఇకపోతే ఈ బ్యూటిఫుల్ హీరోయిన్ ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ ఏదో ఒక పోస్ట్‌తో అభిమానుల్ని మెస్మరైజ్ చేస్తుంటుంది.

అప్పుడప్పుడు సంప్రదాయ దుస్తుల్లో దర్శనమివ్వగా.. అప్పుడప్పుడు హాట్ హాట్ దుస్తుల్లో నెటిజన్లను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటోంది. అయితే తాజాగా నేషనల్ క్రష్ సోషల్ మీడియా వేదిక అయిన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. ‘‘నువ్వు చాలా ప్రేమలో ఉన్నావు. ఇప్పుడు, ఆ ప్రేమ నాకు చాలా చెప్పడానికి ఉంది. నా జీవితంలోకి దారి చూపినందుకు ధన్యవాదాలు’’ అంటూ తనను తాను కొనియాడుకుంది ఈ బ్యూటీ.

# ‘ముద్దులు పెట్టుకోవడం అసౌకర్యంగా అనిపించి స్క్రిప్ట్‌లను తిరస్కరించాను’.. ప్రముఖ హీరోయిన్ సంచలన వ్యాఖ్యలు



డైలీ మెయిల్‌తో జరిగిన చాట్‌లో ఐశ్వర్య రాయ్ సన్నిహిత సన్నివేశాలు, ముఖ్యంగా ముద్దులు పెట్టుకోవడం తనకు అసౌకర్యంగా అనిపించినందున పాశ్చాత్య చిత్రాల నుంచి అనేక స్క్రిప్ట్‌లను తిరస్కరించానని వెల్లడించింది. తాను ఇంతకు ముందు ఎప్పుడూ తెరపై అలాంటి సన్నివేశాలు చేయనందున, ఆ ఆలోచన తనకు సరిగ్గా అనిపించలేదని వెల్లడించింది.
తాను అలాంటి పాత్రను పోషించబోతున్నట్లయితే, మొదట భారతీయ సినిమాలో చేయాలని కోరుకుంటున్నానని ఆమె వివరించింది. ధూమ్ 2 లో తన అనుభవాన్ని ఆమె గుర్తుచేసుకుంది. అప్పుడు ఆమె తెరపై ముద్దు చాలా వివాదాలకు దారితీసిన విషయం అందరికీ తెలిసిందే.

యువతులకు రోల్ మోడల్‌గా తనను చూసినప్పటికీ, ఆమె అలాంటి సన్నివేశాలు చేయడం పట్ల తమ అసౌకర్యాన్ని వ్యక్తం చేస్తూ.. పలువురి నుంచి ఆమెకు కొన్ని లీగల్ నోటీసులు వచ్చాయి. ఆమె ఐకానిక్ హోదా , ఆదర్శప్రాయమైన వ్యక్తిగత జీవితాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆమె ఎందుకు అలా చేయాలని ఎంచుకున్నారో వారు ప్రశ్నించారు.

అభిమానుల నుంచి లీగల్ నోటీసులు అందుకోవడంతో ఐశ్వర్య ఆశ్చర్యపోయింది. ఒక నటిగా తన పనిని కేవలం చేస్తూ, ఒక సినిమాలోని సన్నివేశం కొన్ని సెకన్ల గురించి వివరించమని అడుగుతున్నారని నమ్మశక్యం లేకుండా ఉంది.

సినిమాల్లోని చాలా మంది నటులు తెరపై ముద్దులు పెట్టుకున్నప్పటికీ, భారతీయ సంస్కృతిలో బహిరంగంగా ఆప్యాయత ప్రదర్శించడం ఇప్పటికీ అసాధారణమని ఆమె ఎత్తి చూపారు. భారతీయ సినిమాల్లో కూడా నటులు తెరపై ముద్దు పెట్టుకోవడం చాలా అరుదుగా జరుగుతుందని, తరచుగా దానిని వేదికపై ప్రదర్శించినట్లుగా చూపిస్తారని ఆమె అన్నారు.

## ఫ్లాప్ డైరెక్టర్‌తో మాస్ కా దాస్ సరికొత్త ప్రయత్నం..

# ఈ సారైనా కలిసొచ్చేనా?



మాస్ కా దాస్ విశ్వక్ సేన్(Vishwak Sen) నటించిన మెకానిక్ రాకీ, లైలా వరుస డిజాస్టర్స్‌గా నిలిచాయి. హిట్ ఫ్లాప్ అని ఆలోచించకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ప్రకటిస్తున్నాడు. ఇక ఇప్పుడు స్క్రిప్ట్‌పై దృష్టిలో పెట్టుకుని ఆచితూచి అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నాడు. ప్రస్తుతం ‘ఫంకీ(Funky) చిత్రంలో నటిస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతుండగా.. దీనిని అనుదీప్ కేపీ(Anudeep KP) తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీతో పాటు ‘VS-13’లోనూ నటిస్తున్నాడు. తాజాగా, విశ్వక్ సేన్ ఓ వెబ్ సిరీస్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ‘డియర్ కామ్రెడ్’ ఫేమ్ భరత్ కమ్మ(Bharat Kamma)తో మాస్ కా దాస్ ఓ సిరీస్ చేయనున్నట్లు తెలుస్తోంది. దీనిని ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదల కాబోతున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇక ఇప్పటికే ఓటీటీలో రానా దగ్గుబాటి, రానా వంటి స్టార్స్ రాణిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు విశ్వక్ సేన్ కూడా వెబ్ సిరీస్‌తో రాబోతుండటం విశేషం.



## లక్నోపై పంజాబ్ విజయం..

# ప్లే ఆఫ్స్‌కు చేరువగా కింగ్స్

ఐపీఎల్ 18లో పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి ప్లే ఆఫ్స్‌కు చేరువైంది. ధర్మశాల వేదికగా ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై 37 పరుగుల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ 5 వికెట్ల నష్టానికి 236 రన్స్ చేసింది. ప్రభ్‌సిమ్రాన్(91)కుతోడు ఇతర బ్యాటర్లు తలా ఓ చేయి వేయడంతో పంజాబ్.. లక్నో ముందు 237 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఛేదనలో పోరాడిన లక్నో 199/7 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. ఛేదనలో లక్నోకు సరైన ఆరంభం దక్కలేదు. అర్ష్‌దీప్ ఆరంభంలోనే ఆ జట్టును దెబ్బకొట్టాడు. మార్ష్(0), మార్‌క్రమ్(13), పూరన్(6)లను అవుట్ చేశాడు. దీంతో పవర్ ప్లేలోనే లక్నో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. పంత్(18) మరోసారి చేతులెత్తేయగా.. మిల్లర్(11) కూడా నిరాశపర్చడంతో 73 రన్స్‌కే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో ఆయుశ్ బదోని(74) జట్టును ఆదుకున్నాడు. అతనికితోడు అబ్దుల్ సమద్(45) కూడా సత్తాచాటాడు. వీరిద్దరూ దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును గాడిన పట్టారు. పంజాబ్ బౌలర్లపై విరుచుకపడి ఇద్దరూ పోటాపోటీగా బౌండరీలు కొట్టారు. దీంతో 154/6తో లక్నో పోటీలోకి వచ్చింది. అయితే, పంజాబ్ బౌలర్లు మరింత పట్టు వదలకుండా జాగ్రత్తపడ్డారు. ఈ క్రమంలో సమద్‌ను జాన్సెన్ అవుట్ చేయడంతో లక్నో షాక్ తగిలింది. ఇక, చివరి ఓవర్‌లో చాహల్.. బదోనికి కూడా చెక్ పెట్టాడు. దీంతో లక్నో 200లోపే కట్టడి అయ్యింది. లక్నో వరుసగా మూడో పరాజయంతో ప్లే ఆఫ్స్ ఆశలను సంక్లిష్టం చేసుకుంది.

**రెచ్చిపోయిన ప్రభ్‌సిమ్రాన్**

ముందుగా పంజాబ్‌కు పేలవ ఆరంభమే దక్కింది. యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(1) తొలి ఓవర్‌లోనే వికెట్ పారేసుకున్నాడు. అయితే, మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్(91) మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పోటాపోటీగా ఫోర్లు, సిక్స్‌లు దంచి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో ప్రభ్‌సిమ్రాన్‌కు ఇది 3వ అర్ధ శతకం. హాఫ్ సెంచరీ తర్వాత అతను మరింత చెలరేగి ఆడాడు. ఓపెనర్‌గా వచ్చిన 19వ ఓవర్ వరకు నిలబడ్డాడు. 19వ ఓవర్‌లో ఐదో బంతికి దిగ్వేశ్ అవుట్ చేయడంతో ప్రభ్‌సిమ్రాన్ తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతను 48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 91 రన్స్ చేశాడు. ప్రభ్‌సిమ్రాన్ తర్వాత పంజాబ్ ఇన్నింగ్స్‌లో మిగతా వాళ్లు కూడా క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సత్తాచాటాడు. 25 బంతుల్లో 45 రన్స్ చేశాడు. జోష్ ఇంగ్లిస్(30) కూడా కాసేపు మెరుపులు మెరిపించాడు. ఇక, శశాంక్ సింగ్(33నాటౌట్), స్టోయినిస్(15 నాటౌట్) కూడా డెత్ ఓవర్లలో చెలరేగిపోయారు. దీంతో పంజాబ్ 236 పరుగుల భారీ స్కోరు చేయగలిగింది.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465